




Bhavani Publication Trust

APTEL/2001/5268

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 24 | సంచిక : 348 | హైదరాబాద్ | శనివారం 30 నవంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR


# ఇందిరమ్మ ఇంట్లో అదనపు గదులకు ఓకే!

ఇందిరమ్మ ఇంట్లో అదనపు గదులకు ఓకే!

లబ్ధిదారులను అనుమతించాలన్న సీఎం

పథకంలో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం

ఆదివాసీ, ఐటీడీఏల్లో ప్రత్యేక కోటా

దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు,

కార్మికులకు పెద్దపీట.. సమీక్షలో రేవంత్



ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేనివారు, పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్య క్రమంలో ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేనివారు, పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్య క్రమంలో ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ పథకం కింద ప్రభుత్వం అందించే ఇళ్లలో లబ్ధిదారులెవరైనా అదనపు గదులు నిర్మించుకునేందుకు ఆసక్తి కనబరిస్తే.. అందుకు అవకాశం కల్పించాలన్నారు. ఇక రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ప్రత్యేక కోటాను అమలు చేయాలని నిర్దేశించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిదశలో సొంత స్థలాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పథకం అమలులో గ్రామ కార్యదర్శితోపాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయాలని, అవసరమైన

- మిగతా 2వ పేజీలో



# దేశానికి వ్యతిరేకంగా విపక్షాల కుట్రను ఎండగట్టాలి

(ప్రజాతీర్పు ప్రతినిధి, భువనేశ్వర్)

కాంగ్రెస్, విపక్ష పార్టీలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. అధికారం తమ జన్మహక్కుగా భావిస్తూ వచ్చిన వాళ్లు పదేళ్లుగా అధికారం దక్కలేదన్న ఆక్రోశంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ, దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో శుక్రవారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా తాను భిన్న రాజకీయాలను చూశానని, రాజకీయాల్లో విధాన పరమైన వ్యతిరేకతలు సహజమేనని అన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా భిన్నాభిప్రాయాలు ఉంటాయని, రాజకీయ పార్టీలు ఉద్యమాల ద్వారా తమ సందేశాన్ని ప్రజల ముందుకు తీసుకు వెళ్తుంటారని అన్నారు. అయితే అవన్నీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పరిధిలోకి ఉండాలన్నారు. గత కొద్దికాలంగా చాలా పెద్ద మార్పు రావడం అంతా చూసే

- మిగతా 2వ పేజీలో

## వైఎస్ జగన్ సంచలన నిర్ణయం.. ప్రతి బుధ, గురువారాలు కార్యకర్తలతో భేటీ!



(ప్రజాతీర్పు ప్రతినిధి, అమరావతి)

వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల్లో ఘోర పరాజయం కావడంతో పార్టీ బలపేతంపై ఫోకస్ చేసిన ఆయన.. క్షేత్రస్థాయిలో అన్ని జిల్లాలను పర్యటించాలని నిర్ణయించుకున్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా నేతలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ భేటీలోనే జిల్లాల పర్యటనపై తన నిర్ణయాన్ని ప్రకటించారు. సంక్రాంతి తర్వాత నుంచి జిల్లాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రతి బుధ, గురువారాలు జగన్ కార్యకర్తలతోనే గడపనున్నారు. ఆ సమయంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. ఇందుకోసం రోజుకు 3 నుంచి 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించే అవకాశం ఉంది. అలాగే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ జగన్ సమీక్షలు నిర్వహించనున్నారు.

## గుజరాత్ గులాములు..

# ఢిల్లీ కీలుబొమ్మలు




ఇలాంటి వారితో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం

ఆనాడు ఉద్యమంపై గన్నెక్కుపెట్టిన సీఎం రేవంత్

తెలంగాణ ఆనవాళ్లను చెరిపేసేందుకు కుట్రలు పన్నుతున్నడు

ప్రతీ విషయంలోనూ ప్రభుత్వంపై ప్రతిఘటనే : కేటీఆర్

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

గుజరాత్ గులాములు, ఢిల్లీ కీలు బొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం పొంచి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆనాడు ఉద్యమంపై గన్నెక్కుపెట్టిన వ్యక్తే నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. అలాంటి సీఎం తెలంగాణ ఉద్యమ రథసారధి కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతు న్నారని ఎద్దేవా చేశారు. తద్వారా తెలంగాణ ఆనవాళ్లే లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై ప్రతిఘటనకు పూనుకోవటం ద్వారా రేవంత్ సర్కార్ చర్యలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం 'దీక్షా

- మిగతా 2వ పేజీలో

# నిలదీసి.. నిగ్గదీసి



కాకినాడ పోర్టులో రేషన్ మాఫియాపై డిప్యూటీ సీఎం పవన్ శివాలు

యథేచ్ఛగా బియ్యం తరలిపోతుంటే అంతా ఏం చేస్తున్నారంటూ నిప్పులు

డీఎస్‌వో, కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, పోర్టు అధికారులపై తీవ్ర ఆగ్రహం

ఉద్యోగాలు చేస్తున్నారా.. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారా అంటూ ఊగిపోయిన పవన్

(ప్రజాతీర్పు ప్రతినిధి, కాకినాడ)

కాకినాడ నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్న వైనంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు పద్ధతి మార్చుకోకుండా మాఫియాకు సహకరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. రేషన్‌బియ్యం విదేశాలకు తరలిపోయేలా అధికారులే సహకరిస్తున్నారంటూ శివాలెత్తారు. డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారులను పిలిచి ఏంచేస్తున్నారు మీరంతా అంటూ మండిపడ్డారు. కాకినాడ జిల్లా ఎస్పీకి ఎన్నిసార్లు చెప్పినా కనీసం స్పందన లేదని దునుమాడారు. తాను జిల్లాకు ఎప్పుడు వచ్చినా సెలవుపై ఉంటున్నారు.. అంటూ మండిపడ్డారు. ఆయనకు నోటీసులు పంపాలని ఆదేశించారు. కాకినాడపోర్టు ప్రమాదకరంగా మారిందని, దీనిపై ప్రధాని, కేంద్ర హెూంమంత్రికి లేఖ రాస్తానని హెచ్చరించారు. కాకినాడ పోర్టులో పవన్‌కళ్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం పర్యటించారు. తొలుత 12.45గంటలకు యాంకరేజ్ పోర్టులో బార్జిలో తనిఖీలు చేశారు. ఇందులో రేషన్

- మిగతా 2వ పేజీలో

# రాష్ట్ర పండుగగా ప్రజా విజయోత్సవాలు

## రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

కాంగ్రెస్ ప్రభు త్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహిం చను న్న 'ప్రజాపాలన -ప్రజా విజ యోత్స వాలు' కార్యక్రమాన్ని రాష్ట్ర పండు గగా నిర్వహించాలని ప్రభు త్వం నిర్ణయిం చింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వు లు జారీచేశారు. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మండల స్థా యి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రణాళిక రూపొందించాలని, ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులను భాగస్వాముల చేయాలని తెలిపారు.

## ఎన్నికల ఫలితాలు ఓ సవాల్.. ఐక్యంగా పార్టీని బలోపేతం చేయాలి: ఖర్గే



3

## హిందువుల రక్షణ బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వానిదే.. లోక్‌సభలో ప్రకటన



3



## దేశానికి వ్యతిరేకంగా విపక్షాల కుట్రను ఎండగట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటారని, భారత రాజ్యాంగ స్ఫూర్తిని అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని మోదీ అన్నారు. ప్రజాసామ్య విధివిధానాలకు తిలోదకాలు ఇస్తున్నారని అన్నారు. అధికారం తమ జన్మహక్కుగా భావిస్తూ వచ్చిన వాళ్లు పదేళ్లుగా కేంద్రంలో అధికారానికి దూరమయ్యారని, తమను కాకుండా వేరేవారికి ప్రజలు ఆశీర్వదించడం గిట్టక మొదటి రోజు నుంచే ప్రజలపై కన్నెర్ర చేశారని విపక్షాలకు చురకలు వేశారు.

**అబద్ధాల దుకాణం 50 ఏళ్లకు పైగా నడుపుతున్నారు**

అధికారం దక్కలేదనే ఆగ్రహంతో దేశానికి వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని, ప్రజలపై ఆగ్రహంతో దేశాన్ని తప్పుదారి పట్టించి తప్పుడు మార్గంవైపు నెడుతున్నాయని అన్నారు. "వాళ్ల అబద్ధాల దుకాణాన్ని 50-60 ఏళ్లుగా నడుపుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు, బీజేపీ కార్యకర్తలు, దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ జాగ్రుతమై వారిని ఎదుర్కోవాలి. ఇది ఒక పెను సవాలు. ఆ దృష్ట్యా ప్రతి క్షణం అందరూ అప్రమత్తంగా ఉంటూ, ప్రజలను జాగృతం చేస్తూ, విపక్షాల అబద్ధాలను బహిర్గతం చేయాలని దేశప్రజలను కోరుతున్నాను" అని మోదీ అన్నారు.



## నిలదీసి.. నిగ్గదీసి

(మొదటి పేజీ తరువాయి)

బియ్యం ఎగుమతి అవుతుండడంతో ఇటీవల అధికారులు పట్టుకున్నారు. నేరుగా పవన్ బార్జి ఎక్కి బియ్యం ప్లేటులో వేసి పరిశీలించారు. రేషన్ బియ్యం ఆనవాళ్లను గుర్తించారు. అక్కడే ఉన్న డీఎస్వో, కలెక్టర్, పోర్టు అధికారి, ఇతర అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. రేషన్ మాఫియాకు మీరంతా సహకరించకపోతే ఇలా ఎలా దేశాలు దాటిపోతుందని శివాలెత్తారు. హూఈజ్ ఆలీషా అంటూ ప్రశ్నించారు. ఉద్యోగాలు చేస్తున్నారా.. మాఫియాకు వంత పాడుతున్నారా? అంటూ మండిపడ్డారు. పక్కనే ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశించి దీనిపై మరింత గట్టి పోరాటం చేయాలని, నెమ్మదిగా ఉండకూడదని పేర్కొన్నారు. అనంతరం అక్కడినుంచి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత డీప్‌వాటర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి టగ్ ఎక్కి సముద్రంలోకి వెళ్లారు. తుఫాను ముప్పు నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో పవన్ సముద్రంలోకి వెళ్తారని అధికారులు అనుకోలేదు. కానీ అనూహ్యంగా ఆయన టగ్ ఎక్కి తొమ్మిది నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పశ్చిమ ఆఫ్రికా నౌక స్టెల్లా ఎల్ పనామా వద్దకు బయలుదేరారు. సముద్రం భయానకంగా ఉండడంతో అధికారులు వద్దని వారించారు. అయినా పవన్ వినలేదు. నౌకవద్దకు వెళ్లిన తర్వాత పైకి ఎక్కి ఎగుమతికి సిద్ధంగా ఉన్న 640టన్నుల బియ్యాన్ని పరిశీలించాలి. కానీ వాతావరణం బాగోలేదని, నౌకపైకి ఎక్కొద్దని అధికారులు పవన్‌కు తెలిపారు. సముద్ర ప్రయాణం మధ్యలో పవన్ ఎమ్మెల్యే కొండబాబు సమక్షంలో అధికారులపై మండిపడ్డారు. రేషన్ మాఫియాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మొత్తం సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్ అయ్యిందన్నారు. డీఎస్ఓ ప్రసాద్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు అధికారి ధర్మశాస్త్ర, డీఎస్పీ రఘువీర్‌పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా ఎల్ పనామా భారీ నౌకను సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ యాంకరేజ్‌పోర్టులో పూర్తిస్థాయిలో అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పోర్టులో ఉన్న రెండు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు నిఘా ఉండాలన్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి డీప్‌వాటర్ పోర్టుకు చేరుకున్న పవన్ విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. రేషన్ మాఫియా కాకినాడలో దారుణంగా ఉందని, తనను నౌక ఎక్కనీయకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొని సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండునెలలుగా కాకినాడ పోర్టులో తనిఖీలకు తనను రాకుండా అధికారులు ఏవో సాకులు చెప్పి అడ్డుకుంటున్నారని గుర్తు చేసి బాంబు పేల్చారు. అలా అయితే తానే వస్తానని, పోలీసు సిబ్బంది కూడా వద్దని హెచ్చరించడంతో అప్పుడు అంగీకరించారన్నారు. తాను ఢిల్లీ నుంచి అమరావతి వెళ్లాలని, కానీ రేషన్ మాఫియా తీవ్రత నేపథ్యంలో కాకినాడ పర్యటనకు వచ్చానని తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం పవన్ అమరావతికి బయలుదేరారు.

## డిసెంబర్ 2కు పార్లమెంట్ వాయిదా



పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. యూపీలోని సంభల్‌లో చెలరేగిన హింస, అదానీ అవినీతి తదితర అంశాలపై చర్చ జరగాలంటూ విపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభల కార్యక్రమాలకు శుక్రవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఉభయ సభలను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు. తొలుత 11 గంటలకు లోక్‌సభ సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ ఎంపీలు స్పీకర్ స్థానం దగ్గరకు వచ్చి నినాదాలు చేయడం ప్రారంభించారు. ప్రశ్నోత్తరాల సమయంలో రెండు ప్రశ్నలు పూర్తయ్యాయో లేదో తిరిగి సభకు ఆటంకం ఏర్పడటంతో స్పీకర్ ఓం బిర్లా సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా సభలో నిరసనలు కొనసాగాయి. దీంతో సభను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తామిచ్చిన వాయిదా నోటీసులను చైర్మన్ ధన్‌కర్ తిరస్కరించడంతో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

# గుజరాత్ గులాములు.. ఢిల్లీ కీలుబొమ్మలు

(మొదటి పేజీ తరువాయి)



దివస్' పేరిట రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంబురాలు నిర్వహించారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో కేటీఆర్%ౌ% తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ%ౌ% కాంగ్రెస్ పార్టీపైనా, రేవంత్ సర్కార్‌పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తూర్పారబట్టారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు సంబంధించిన వివిధ ఘట్టాలను ప్రస్తావిస్తూ భావోద్వేగంతో ప్రసంగించారు. లగచర్లలో భూ సేకరణను ప్రభుత్వం నిలిపేయటం బీఆర్ఎస్ విజయంగా ఆయన అభివర్ణించారు. తెలంగాణ కోసం ఆనాడైనా, ఏనాడైనా కొట్లాడేది తమ పార్టీయేనని అన్నారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ తరపున ఎనిమిది మంది, బీజేపీ తరపున మరో ఎనిమిది మంది ఎంపీలున్నా%ౌ% తెలంగాణ కోసం పార్లమెంటులో ఏనాడూ కొట్లాడలేదని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అదానీ, ప్రధాని%ౌ% ఇక్కడ అడుగు పెట్టే సాహసం చేయలేకపోయారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు తెలంగాణ మీద పట్టుకోసం ఆ రెండు పార్టీలు రాబందుల్లా వస్తున్నాయని హెచ్చరించారు. అంతేతప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టే వాళ్లే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మామూలుగా తీసుకోకూడదని అన్నారు. రాష్ట్రంలోని కవులు, కళాకారులు, మేధావులంతా తెలంగాణపై జరుగుతున్న దాడిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాల వారిలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తిని రగిలించాలని పిలుపునిచ్చారు.లగచర్ల భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం వెనక్కి పోవటమనేది బీఆర్ఎస్ విజయంగా కేటీఆర్ అభివర్ణించారు. అక్కడ బ్రిటీషర్ల కంటే ఎక్కువగా రేవంత్ సర్కార్ వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల పోలీసులు బందిపోట్లలాగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. అయినా ప్రజలు, బీఆర్ఎస్ పోరాట పటిమ ముందు ప్రభుత్వం తలవంచక తప్పలేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన రేవంత్‌ను తక్కువగా అంచనా వేయొద్దనీ, మరో రూపంలో భూములు లాక్కొనేందుకు వస్తారని హెచ్చరించారు. అందువల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇంట్లో అదనపు గదులకు ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతికతను వినియోగించుకోవాలని అన్నారు. పథకం కోసం రూపొందించిన మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, ఏ దశలోనూ లబ్ధిదారుకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదే సమయంలో శాఖాపరంగా కూడా ఎలాంటి పొరపాట్లకు తావుం డొద్దన్నారు. పథకాన్ని సమర్థంగా కొనసాగించేందుకు వీలుగా గృహనిర్మాణ శాఖ బలోపేతం కావాలని, అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్, మెదక్‌తోపాటు మరో రెండు జిల్లాల్లోని ఒక గ్రామం, మునిసిపాలిటీ పరిధిలోని ఒక వార్డులో యాప్‌ను పైలట్ ప్రాజెక్టు కింద పరిశీలిస్తున్నారు. యాప్‌లో పొందు పరచాల్సిన వివరాలను పూర్తిస్థాయిలో తీసుకుంటుందా, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు తలెత్తుతాయా, ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను యాప్‌లో నమోదుచేసేందుకు ఎంత సమయం పడుతుంది వంటి ,అన్ని అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు పరిశీలనలో యాప్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే.. వాటన్నింటినీ పరిశీలించి, పథకం అమలుకు చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు కేంద్రం అందించే ప్రధానమంత్రి ఆవాసయోజన పథకంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం కూడా తమ పథకం అమలు పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేసిన వివరాలను, కేంద్రం సూచించే యాప్‌లోనూ పొందుపరచాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వ యాప్‌ను.. కేంద్రం సూచించే యాప్‌నకు అనుసంధానం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అలా అనుసంధానిస్తేనే దరఖాస్తుదారులకు పథకం అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబరు 1 నుంచి 9వరకు నిర్వహించబోయే ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమాల్లో ఏదో ఒకరోజు పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారు ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 4.50 లక్షల ఇళ్లను అర్హులకు అందించనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

## 500 కిలోల డ్రగ్స్ సీజ్
## అరేబియా సముద్రంలో భారత్ శ్రీలంక సంయుక్త ఆపరేషన్



అరేబియా సముద్రంలో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. భారత్, శ్రీలంక నేవీలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రెండు చేపల వేట పడవల నుంచి 500 కిలోల క్రిస్టల్ మెథాంఫెటమిన్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. శ్రీలంక జెండాలతో ప్రయాణిస్తున్న రెండు పడవలపై శ్రీలంక నేవీ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఇరు దేశాల నేవీలు జాయింట్ ఆపరేషన్ చేపట్టినట్టు భారత నేవీ ప్రకటించింది. న్యాయపరమైన చర్యల కోసం పట్టుబడిన డ్రగ్స్, పడవలు, వాటిలోని సిబ్బందిని శ్రీలంకకు అప్పగించినట్టు వెల్లడించింది.

**62 దేశాల ఆపరేషన్..**
**1,400 టన్నుల డ్రగ్స్ పట్టివేత**

62 దేశాలు కలిసి చేపట్టిన 'ఆపరేషన్ ఓరియన్'లో భారీగా మత్తు పదార్థాలు దొరికాయి. ఆరు వారాల పాటు చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో 225 టన్నుల కొకైన్, 1000 టన్నుల మరిజువానాను కొలంబియా సహా వివిధ దేశాల నౌకా దళాలు సీజ్ చేశాయి. ఇంత భారీ ఎత్తున కొకైన్ పట్టుబడటం ఇదే మొదటిసారి. డ్రగ్స్ ను అక్రమ రవాణా చేస్తున్న ఆరు జలా ంతర్గాములను సీజ్ చేశారు. డ్రగ్స్ రవాణాతో సంబంధమున్న 400 మందిని అరెస్టు చేశారు. దక్షిణ అమెరికా నుంచి ఆస్ట్రేలియాకు డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తున్న కొత్త పసిఫిక్ సముద్ర దారిని ఈ ఆపరేషన్‌లో గుర్తించినట్టు కొలంబియా నేవీ వెల్లడించింది.

## భారత్‌లో విమానాల ఆలస్యానికి ప్రధాన కారణాలు



పొగ మంచు, దారి కనిపించకపోవడం, వర్షాలు, సాంకేతిక కారణాల వల్ల భారత్‌లో ఇటీవల తరచూ విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. వీటికి తోడు బాంబు బెదిరింపులు, ప్రయాణికుల రద్దీ,, రన్ వేపై దిగడంలో సమస్యలు వంటివాటి వల్ల విమానాలు బయల్దేరడంలో ఆలస్యం జరుగుతున్నది. ముఖ్యంగా ఢిల్లీ విమానాశ్రయంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమానం కనీసం రెండు గంటలు ఆలస్యమయ్యే అవకాశం ఉంటే, దానిలోని ప్రయాణికులను దించేయాలని, అది బయల్దేరినపుడు మరోసారి భద్రతాపరమైన తనిఖీలు చేయరాదని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులు నిర్ణయించారు.

# అబద్ధాలను అందంగా అల్లటంలో జగన్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాలి : వైఎస్ షర్మిల

సెకీతో విద్యుత్ ఒప్పందాలలో అబద్ధాలను అందంగా అల్లటంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని వైఎస్ షర్మిల విమర్శించారు. శాలువలు, సన్మానాలు, అవార్డులు కోరుకొనే ముందు జగన్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ట్విటర్‌లో లో డిమాండ్ చేశారు. 2021 మే నెలలో సెకీ వేసిన వేలంలో యూనిట్ ధర గరిష్టంగా రూ.2.14 పైసలు ఉంటే, రూ 2.49 పైసలకు కొన్నందుకు శాలువలు కప్పాలా ? అంటూ ఎద్దేవా చేశారు. అదానీ వద్ద గుజరాత్ రాష్ట్రం యూనిట్ ధర రూ 1.99 పైసలకే కొంటే.. అదే కంపెనీ నుంచి 50పైసలు ఎక్కువ పెట్టి, రూ.2.49 పైసలకు కొన్నందుకు మీకు సన్మానాలు చేయాలా ? అదానీతో ఒప్పందానికి దేశంలో ఏ రాష్ట్రం ముందుకు రాకుంటే. ఆగమేఘాల మీద ఒప్పందానికి మీరు ముందుకు వచ్చినందుకు మీకు అవార్డులు ఇవ్వాలా ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ట్రాన్స్మిషన్ ఛార్జీల భారం అక్కడ ఇక్కడ లేకుంటే గుజరాత్‌కి ఇచ్చిన రేటు ప్రకారం ఏపీకి రూ 1.99 పైసలకు అదానీ ఎందుకు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఒక ముఖ్యమంత్రిని ఒక వ్యాపారవేత్త అధికారికంగా కలిస్తే గోప్యత పాటించడం దేశంలో ఎక్కడైనా ఉందా ? దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని కోరారు.



**రూ.1,750 కోట్లు ముడుపులు ఇవ్వడం చరిత్ర**

అదానీతో ఒప్పందం రాష్ట్రంలోనే కాదు అంతర్జాతీయంగా చరిత్రనేని, రూ.1750 కోట్లు నేరుగా ముఖ్యమంత్రికి ముడుపులు ఇవ్వడం చరిత్రేనని ఆరోపించారు. ఎవడు కొనేందుకు ముందుకు రాని విద్యుత్‌ను బంపర్ ఆఫర్‌గా ప్రకటించుకోవడం , గంటల్లోనే క్యాబినెట్ పెట్టి, ప్రజా అభిప్రాయం లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం , అదానీ కోసం అన్ని టెండర్లు రద్దు చేయడం చరిత్ర. ఒక వ్యక్తి స్వప్రయోజనాల కోసం ఏపీ రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1.67 లక్షల కోట్ల భారాన్ని మోపడం చరిత్రేనని విమర్శించారు. అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన రిపోర్ట్ లో నాపేరు ఎక్కడుందని బుకాయిస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఏపీ సీఎంగా అంటే ఆనాడు మీరు కారా. ఆ కుర్చీలో మీరు కాకుండా మిమ్మల్ని నడిపించే వాళ్లు కూర్చున్నారా? సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముడుములు ముట్టాకే ఒప్పందాలు చేసుకున్నారని ఓ వంద పేజీల రిపోర్ట్ కూడా ఇచ్చాయని వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎక్కువ ధరకు పీపీఎల్(%ఫ్రూా%) చేసుకుందని, రూ.35వేల కోట్ల భారం వేసిందని ఆరోపించిన జగన్ అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. టెండర్లను ఎందుకు రద్దు చేయాలేదని , ఎందుకు విచారణ జరిపించలేదని ట్విటర్‌లో నిలదీశారు. నిజంగా అదానీతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి లేకుంటే, అదానీ వల్ల ఆర్థికంగా లబ్ధి పొందలేదని అనుకుంటే బైబిల్ మీద ప్రమాణం చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన.. హెజ్బొల్లా స్థావరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి!

హెజ్బొల్లాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, సరిహద్దులో సామాన్యులు తిరిగి స్వస్థలాలకు చేరుకోవటాన్ని ఇజ్రాయెల్ బలగాలు అడ్డుకుంటున్నాయి. పెద్ద సంఖ్యలో అనుమానిత వ్యక్తులు దక్షిణ లెబనాన్ ప్రాంతంలోకి వస్తున్నారని, ఇది కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన కిందకే వస్తుందని ఐడీఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీని కంటే కొద్ది గంటల ముందు 'హెజ్బొల్లా' నుంచి కూడా ముఖ్యమైన ప్రకటన ఒకటి విడుదలైంది. ఇజ్రాయెల్ బలగాలను అంతమొందించటం కోసం తమ ఫైటర్స్ కాచుకొని ఉన్నారని తెలిపింది. గురువారం దక్షిణ లెబనాన్‌లోని ఆరు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైనిక ట్యాంక్‌లు దాడులు నిర్వహించాయి. అలాగే అదే ప్రాంతంలో మధ్యశ్రేణి రాకెట్లను నిల్వ చేయడానికి హెజ్బొల్లా వినియోగించే స్థావరంలో ఉగ్రవాద కార్యక్రమాలు గుర్తించామని, వాటిని తమ వైమానిక దళం అడ్డుకుందని ఇజ్రాయెల్ మిలటరీ తెలిపింది. తమ ఆర్మీ బలగాలు ఇంకా దక్షిణ లెబనాన్‌లోనే ఉన్నాయని, కాల్పుల విరమణ ఒప్పంద షరతులను అతిక్రమించకుండా అవి చూస్తాయని పేర్కొంది. ఫ్రాన్స్, అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా నాయకులకు మధ్య కుదిరిన



కాల్పుల విరమణ బుధవారం తెల్లవారుజాము నుంచి అమల్లోకి వచ్చింది. ఫలితంగా లెబనాన్, ఇజ్రాయెల్ సరిహద్దులో శరణార్థులుగా మారిన ప్రజలంతా తిరిగి తమ సొంత ప్రాంతాలకు వస్తున్నారు. యుద్ధం కారణంగా దక్షిణ లెబానాన్‌ను వీడి వెళ్లిపోయిన వేలాదిమంది తిరిగి తమ ఇండ్లను వెతుక్కుంటూ వస్తున్నారు. అయితే సరిహద్దులో ఐడీఎఫ్ బలగాలు వారిని అడ్డుకుంటున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ నిఘా డ్రోన్లు ఎగురుతున్నాయని 'రాయిటర్స్' కథనం పేర్కొన్నది.

## చిన్మయి కృష్ణదాస్ బ్యాంక్ ఖాతాను నిలిపేసిన బంగ్లాదేశ్




బంగ్లాదేశ్ లో ఇస్కాన్ కు చెందిన చిన్మయి కృష్ణదాస్ బ్యాంకు ఖాతా ను నిలిపేశారు. చిన్మయి కృష్ణదాస్ సహా ఇస్కాన్‌కు చెందిన 17 మంది బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నట్లు బంగ్లాదేశ్ బ్యాంకులకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ విభాగం ప్రకటించింది. నెలరోజులపాటు ఈ ఫ్రీజింగ్ అమలులో ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు బంగ్లాదేశ్‌లోని వివిధ బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఆ 17 ఖాతాల్లో అన్ని రకాల లావాదేవీలను సస్పెండ్ చేసింది. అంతేగాక ఆ 17 ఖాతాలకు సంబంధించిన లావాదేవీల వివరాలతో కూడిన స్టేట్‌మెంట్లను మూడు రోజుల్లోగా తనకు పంపాలని ఆదేశించింది. ఇస్కాన్‌కు చెందిన చిన్మయి కృష్ణదాస్‌ను దేశద్రోహం నేరం కింద బంగ్లాదేశ్ పోలీసులు ఢాకాలోని హజరత్ షాజాలాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత సోమవారం అరెస్ట్ చేశారు.

## హర్యానాలో పోలీసుల ఎన్ కౌంటర్.. బీహార్ గ్యాంగ్ స్టర్ మరణం..!

బీహార్ రాష్ట్రంలో పేరుమోసిన గ్యాంగ్ స్టర్ సరోజ్ రాయ్.. శుక్రవారం హర్యానాలో జరిగిన ఎన్ కౌంటర్ లో మరణించాడని పోలీసు అధికారులు తెలిపారు. అతని తలపై రూ.2 లక్షల రివార్డు ఉంది. గుర్‌గ్రామ్‌లో హర్యానా పోలీసులు, బీహార్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) పోలీసులు నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో సరోజ్ రాయ్ మరణించాడు. ఈ ఎన్ కౌంటర్ లో ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ గాయపడ్డాడు. ఆయనకు గుర్ గ్రామ్ లోని దవాఖానలో చికిత్స అందిస్తున్నట్లు డీజీపీ జేఎస్ గాంగ్వార్ తెలిపారు. ఈ గ్యాంగ్ స్టర్ 33 క్రిమినల్ కేసుల్లో వాంటెడ్ గా ఉన్నాడు.

# హిందువుల రక్షణ బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వానిదే.. లోక్‌సభలో ప్రకటన



బంగ్లాదేశ్‌లో హిందువులతో సహా మైనారిటీల రక్షణ బాధ్యత మమహ్మద్ యూనుస్ సారథ్యంలోని అక్కడి తాత్కాలిక ప్రభుత్వానిదేనని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, హింసాకాండపై లోక్‌సభలో శుక్రవారనాడు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, 2024 ఆగస్టు నుంచి హిందువులు, మైనారిటీలపై పలుమార్లు దాడులు జరిగిన ఘటనలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని చెప్పారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన దుర్గా పూజోత్సవాల్లోనూ ఆలయాలు, పూజా మండపాలపై దాడులు జరిగినట్టు వార్తలు వెలువడ్డా యన్నారు. ఈ ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని తమ ఆందోళనను బంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు చెప్పారు. ఢాకాలోని హైకమిషన్ కార్యాలయం సైతం బంగ్లాదేశ్‌లో మైనారిటీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటోందని జైశంకర్ వివరించారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రాణాలు, స్వేచ్ఛను పరిరక్షించాల్సిన ప్రధాన బాధ్యత ఆదేశ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారిని బంగ్లాదేశ్ ప్రభుత్వం అరెస్టు చేయడం, దీనిపై తీవ్ర నిరసనలు పెల్లుబికిన నేపథ్యంలో జైశంకర్ లోక్‌సభలో తాజా ప్రకటన చేశారు. బంగ్లాదేశ్ జాతీయ జెండా కంటే ఎత్తులో కాషాయం జెండాను ఎగురవేశారనే ఆరోపణను కృష్ణదాస్ ఎదుర్కొంటున్నారు. చిన్మయ్ దాస్ అరెస్టు, బెయిల్ మంజూరు చేయకపోవడంతో ఆయనను విడుదలచేయాలంటూ అటు బంగ్లాలోనే కాకుండా ఇండియాలోనూ నిరసనలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. చిన్మయ్ దాస్ అరెస్టుపై ఐక్యరాజ్యసమితి తక్షణం జోక్యం చేసుకోవాలని ఇస్కాన్ సంస్థ కోరింది. ఈ విషయంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని ఇండియాలోని పలు పార్టీలు విజ్ఞప్తి చేసాయి. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సైతం చిన్మయ్ దాస్ అరెస్టును తప్పుపట్టారు.

# ఆ జాలర్లను విడిపించండి..



తమిళనాడుకు చెందిన పదిమంది జాలర్లను విడిపించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి విజ్ఞప్తి చేశారు. లక్ష ద్వీపాల సమీపంలో చేపలు పపడుతూ సముద్రతీర భద్రతాదళం అధికారులు నిర్బంధించిన తూత్తుకుడి జిల్లాకు చెందిన 10 మంది జాలర్లను విడుదల చేయించాలని పార్లమెంట్ సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న కనిమొళి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా గుజరాత్ రాష్ట్రం పోర్‌బందం సమీపంలో చేపలవేట సాగిస్తూ గల్లంతైన తూత్తుకుడి అయన్‌బొమ్మెయాపురం ప్రాంతానికి చెందిన జాలరి అన్నాదురై ఆచూకీ కనుగొనేందుకు చర్యలు చేపట్టాలని కూడా ఆమె కోరారు.

# ఎన్నికల ఫలితాలు ఓ సవాల్.. ఐక్యంగా పార్టీని బలోపేతం చేయాలి: ఖర్గే దిశానిర్దేశం



లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినప్పటికీ ఆ తర్వాత జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో 'ఇండియా' కూటమి ఫలితాలు సాధించలేకపోవడం, భవిష్యత్ కార్యాచరణపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమీక్షించింది. నాలుగు రాష్ట్రాల్లో రెండు రాష్ట్రాల్లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడం పార్టీకి ఒక సవాలని శుక్రవారంనాడిక్కడ జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఎన్నికల ఫలితాల నుంచి తక్షణమే గుణపాఠం నేర్చుకోవాలని, పార్టీ బలహీనతలను సరిదిద్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. వయనాడ్ లోక్‌సభ నుంచి విజయం సాధించిన ప్రియాంక గాంధీ, నాందేడు ఎంపీ రవీంద్ర వసంతరావు చహన్‌కు సీడబ్ల్యూసీ అభినందలు తెలిపింది. ఎన్నికల్లో ఐక్యంగా ఉంటేనే పార్టీ విజయాలను సాధిస్తుందని, పార్టీ బలంగా ఉంటేనే వ్యక్తులు బలంగా ఉంటారని ఖర్గే ఈ సందర్భంగా అన్నారు. సంస్థాగతంగా కింది స్థాయి నుంచి పార్టీని బలపోతంచేయాలని ఆయన అన్నారు. జాతీయ సమస్యలే కాకుండా, రాష్ట్ర స్థాయి సమస్యలను కూడా ఎజెండా తీసుకుని పార్టీ పోరాటం సాగించాలని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు అనే సమస్యలు ఉన్నాయని, కులగణన కూడా ఒక ముఖ్యమైన అంశమని అన్నారు. ఎన్నికలకు ఏడాదికి ముందే సన్నాహాలు చేసుకోవాలని, విజయాలకు నూతన పద్ధతులను అవలభించాయని ఖర్గే దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగాన్ని అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. సామాన్య ప్రజలకు రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించినది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. ఎన్నికల ప్రక్రియల ఈవీఎంల తీరు అనుమానాస్పదంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పి.చిదంబరం, అభిషేక్ మను సింఘ్వి, దిగ్విజయ్ సింగ్, సచిన్ పైలట్, డీకే శివకుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## సంభల్ మసీదుపై ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు బ్రేక్

మొఘలుల కాలంనాటి షాహీ జామా మసీదు కేసులో ప్రొసీడింగ్స్‌ను తాత్కాలికంగా నిలిపేయాలని సంభల్ ట్రయల్ కోర్టును సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. హింసాత్మక ఘర్షణలు జరిగిన సంభల్‌లో శాంతి, సామరస్యాలను కాపాడాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు కమిషనర్ నిర్వహించిన సర్వే నివేదికను సీల్ చేసి ఉంచాలని, దానిని తెరవవద్దని చెప్పింది. ట్రయల్ కోర్టు ఆదేశాలపై మసీదు కమిటీ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. సంభల్‌లోని చందౌసీ వద్ద ఉన్న ఈ మసీదును సర్వే చేయడానికి సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) ఈ నెల 19న ఆదేశించింది.

## జన్యు మార్పిడి విత్తనాలపై నిషేధం విధించండి



దేశంలో జన్యు మార్పిడి (జీఎం) విత్తనాలపై పూర్తిగా నిషేధం విధించాలని కోరుతూ ప్రధాని మోదీ కి రైతు నేత రాకేశ్ టికాయత్ లేఖ రాశారు. జన్యు పరివర్తన చెందిన పంటలు పర్యావ రణంతోపాటు ప్రజారోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీటీ (బాసిల్లియస్ తురింజియెన్సిస్)పత్తిని దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు.జీఎం పంటలపై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ అక్రమంగా అవి దేశంలోకి వచ్చి చేరుతున్నాయని పేర్కొన్నారు. సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లే అవి దేశంలోకి చొరబడుతున్నాయని విమర్శించారు. వీటి కారణంగా జాతీయ జీవ భద్రతకు పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. జ న్యు మార్పిడి పంటలు క్యాన్సర్, చర్మ సంబంధ సమస్యలతో పాటు పశువులు, పరపరాగ సంపర్కం పైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



## వేదికపైకి వెళ్లేందుకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే యత్నం.. కొట్టిన పార్టీ కార్యకర్తలు

బీజేపీ మాజీ ఎమ్మెల్యే వేదికపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ పార్టీ కార్యకర్తలు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దురుసుగా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యేను వారు కొట్టారు. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉజ్జయినీలోని మహిద్‌పూర్‌లో బీజేపీ కార్యక్రమం జరిగింది. ఉజ్జయినీ ఇన్‌చార్జి మంత్రి గౌతమ్ తెత్వాల్, ఎంపీ అనిల్ ఫిరోజియా పాల్గొన్న ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బహదూర్ సింగ్ చౌహాన్‌ను పార్టీ నేతలు ఆహ్వానించలేదు. కాగా, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడైన బహదూర్ సింగ్ చౌహాన్ ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు అక్కడకు చేరుకున్నారు. వేదికపైకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించగా పార్టీ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఆయన వారితో దురుసుగా ప్రవర్తించారు. ఈ సందర్భంగా ఘర్షణ జరిగింది. ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు చౌహాన్‌ను కొట్టారు. మిగతా నేతలు కల్పించుకుని సర్దిచెప్పారు.



## సొంత గ్రామానికి షిండే.. మహాయుతి కీలక సమావేశం రద్దు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మహాయుతి కూటమి కీలక సమావేశం శుక్రవారం జరుగాల్సి ఉంది. అయితే ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అనూహ్యంగా సతారా జిల్లాలోని తన గ్రామానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో మహాయుతి కూటమి కీలక సమావేశం రద్దైంది. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటులో అనిశ్చితి నెలకొన్నది. బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ నేత అజిత్ పవార్‌తో కలిసి శివసేనకు చెందిన షిండే ఢిల్లీ వెళ్లారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను వారు కలిశారు. మహాయుతి కూటమి నేతృత్వంలో మళ్లీ కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై చర్చించారు. అంతా సానుకూలంగా ఉందని షిండే అన్నారు. కాగా, సీఎం పదవి రేస్‌లో దేవేంద్ర ఫడ్నవీస్ ముందున్నారు. అయితే మహాయుతి కూటమి ప్రభుత్వానికి ఎవరు సారథ్యం వహిస్తారు, క్యాబినెట్ బెర్త్‌ల పంపకంపై ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో వీటిపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం ముంబైలో మహాయుతి కూటమి కీలక సమావేశం జరుగనున్నది. అయితే అనూహ్యంగా సతారా జిల్లాలోని తన గ్రామానికి షిండే వెళ్లారు. దీంతో మహాయుతి కూటమి కీలక సమావేశం రద్దయ్యింది.

# ఒక ఉద్యమకారుని భార్యకు దక్కిన గౌరవమే చైర్ పర్సన్ పదవి

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పెద్దపీట

కేటిఆర్ సారథ్యంలో మున్సిపాలిటీలకు మహర్దశ

కేసిఆర్ తోనే బంగారు తెలంగాణ సాధ్యం

రేవంత్ రెడ్డిది గద్దె కింద ఒక మాట.. గద్దెనెక్కినాక ఒక మాట..

అమలు కానీ హామీలను నమ్మి మోసపోయునం..

మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి

దీక్షా దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసిన చైర్ పర్సన్ ప్రసంగం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి సందీప్, నవంబర్ 29**

తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి ప్రాంతంలో ఆంధ్రా పాలకులకు ఎదురొడ్డి నిలబడిన ఒక ఉద్యమకారుని భార్యకు దక్కిన గౌరవమే చైర్ పర్సన్ పదవి అని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పెద్దపీట వేస్తుందని, కేటిఆర్ సారథ్యంలో మున్సిపాలిటీలకు మహర్దశ కల్పించారని, కేసిఆర్ తోనే బంగారు తెలంగాణ సాధ్యమని, రేవంత్ రెడ్డిది గద్దె కింద ఒక మాట.. గద్దెనెక్కినాక ఒక మాట ఉందని, అమలు కానీ హామీలను నమ్మి మోసపోయునమని, రాబోవు కాలంలో దీక్షా దివస్ స్ఫూర్తితో మరింత ఉద్యమాలు చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. కొత్తగూడెం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, దిక్షా దివస్ ఇన్చార్జి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, దిండిగాల రాజేందర్, భద్రాచలం ఇన్చార్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ 420 హామీలతో గద్దెనక్కిన రేవంత్ రెడ్డి కేవలం రెండే రెండు హామీలు అమలు చేసి తెలంగాణ ప్రజలనుమోసం చేశారని విమర్శించారు. ఉచిత బస్సు పెట్టి ఇంట్లో ఉన్న మహిళలను బస్సుల్లో అల్లం వెల్లుల్లి పొట్టు తీసుకోవడానికి, సరదా కబుర్లు చెప్పుకోవడానికి ఉపయోగపడేలా మార్చారని, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఉన్న పథకాలను ఎత్తేశారని అన్నారు. ఉచిత విద్యుత్ పేరుతో నాలుగు నెలలకు కలిపి వేలల్లో వసూలు చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ హయాంలో కేటిఆర్ సారథ్యంలో మునుపెన్నడూ లేని అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పదవుల కోసం పార్టీ మారిన నాయకులు కాంగ్రెస్ పార్టీ విధానాలతో తలలుఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదని, జై తెలంగాణ అని నినాదం ఇస్తే నోరు మెదపలేని దుస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాగానే తనపై అవిశ్వాసం పెట్టి పైశాచిక ఆనందం పొందారని, ముగ్గురు మంత్రులు ఉండి కూడా అవిశ్వాసంతో ఏమీ చేయలేకపోయారని, ఉద్యమ నాయ కుని భార్యగా ఇలాంటి కుటిల ప్రయత్నాలకు భయపడ లేదన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో సందర్భాలలో ఉద్యమకారులకు భోజనాలు వండి పెట్టిన రోజులు మరచిపోలేనివని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు తెలంగాణలో తేటతెల్లం అయ్యిందని, రాబోవు కాలం బిఆర్ఎస్ పార్టీదేనని, కష్టపడి పనిచేసే కార్య కర్తలకు పెద్దపీట వేస్తుందని, రాబోయే రోజుల్లో ముఖ్య మంత్రిగా కేసిఆర్ కానున్నారని తెలిపారు. అబద్దపు హామీలకు చరమగీతం పాడడం ఖాయమన్నారు.







## విలేకరుల పై పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసు కొట్టివేత


**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**

ఎస్సీ ఎస్టీ కేసులో మణుగూరుకు పట్టణానికి చెందిన విలేకరులపై 2019 లో నమోదైన కేసును కొట్టివేస్తూ ఖమ్మం ఎస్సీ ఎస్టీ స్పెషల్ కోర్ట్, డిస్టిక్ సెషన్ న్యాయమూర్తి దేవినేని రాం ప్రసాదరావు శుక్రవారం తీర్పును వెల్లడించారు. గతంలో అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేసిన గూగులోతు మంగీలాల్ ఫిర్యాదు మేరకు 2019 లో విలేకరులు మాచర్ల శ్రీనివాస్, లింగ శ్రీనివాస్, మారాసు సుధీర్ పై మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఎస్సీ ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదయింది. విచారణ అనంతరం జర్నలిస్టులపై నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును కొట్టివేస్తూ శుక్రవారం అనగా 29.11.2024 ఖమ్మం ఎస్సీ ఎస్టీ స్పెషల్ కోర్ట్, డిస్టిక్ సెషన్ న్యాయమూర్తి దేవినేని రాంప్రసాదరావు తీర్పునిచ్చారు. కేసులో సరైన సాక్షాధారాలు నిరూపణ కానందున కేసు కొట్టివేస్తున్నట్లు తీర్పు వెల్లడించినారు. విలేకరుల తరఫున న్యాయవాదులుగా తేలూరి వెంకటేశ్వరరావు, మిరియాల సైదేశ్వర రావు బలమైన వాదనలు వినిపించి కేసును గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు.

## టిఆర్ఎస్ పార్టీ చేయాల్సింది దీక్ష దివాస్ కాదు కెసిఆర్ దివాలా దివాస్

### టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పుబ్యూరో కరీంనగర్ నవంబర్29)**



టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు పార్టీ శ్రేణులకు దీక్ష దివాస్ చేయాలని పిలుపునిస్తున్నారని టిఆర్ఎస్ శ్రేణులు చేయాల్సింది దీక్ష దివాస్ కాదని కెసిఆర్ దివాలా దివాస్ అని టిపిసిసి మెంబెర్ బొమ్మనపల్లి అశోక్ రెడ్డి ఎద్దేవా చేశారు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కింది అన్నారు వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ హరీష్ రావు అడ్డుపడుతున్నారని అన్నారు దీక్షల పేరుతో ఇంకా తెలంగాణ ప్రజలను మభ్య పెట్టారని చూస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు ప్రజా సంక్షేమ పథకాలతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుంది అని అశోక్ రెడ్డి పేర్కొన్నారు.



## ముగిసిన విఠలారుక్మాయి జాతర

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ నవంబర్ 29)**

నిర్మల్ జిల్లా మండల కేంద్రమైన కుబీర్ లోని శ్రీ విఠలేశ్వరాలయం కార్తీక పౌర్ణమి జాతర శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ముగిసింది,జాతర ఉత్సవాలు ఆలయ పూజారి ప్రమోద్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు,ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడు కూడా గ్రామంలోని శ్రీ విఠలారుక్మాయి, ఆలయంను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.కార్తీక పౌర్ణమి జాతర కోసం గత వారం రోజులుగా ఆలయంలో కొనసాగుతున్న కార్తిక మాస ఉత్సహాలు నేటీతో ముగిసింది, శుక్రవారం ఉదయం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు, రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు,ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొని విఠలారుక్మాయిని దర్శించుకుని,రథోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు,ఈ రథోత్సవం వైభవంగా కన్నుల పండువగా సాగింది,అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు, ఆలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భైంసా రూరల్ సి ఐ నైలు సందర్శించి కుబీర్ ఎస్ ఐ రవీందర్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తూ చేపట్టారు,ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటాజీ, సభ్యులు బోయిడి విఠల్, పుప్పల పీరాజీ,నాగలింగం, సూది రాజన్న, నారా పరశురాం, ఆయా కుల సంఘాల సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.. .

## ఫుడ్ ఫాయిజన్ ఘటనలు పై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసనగా ప్రభుత్వ పాఠశాలల బంద్..!

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్.

**రాజన్న సిరిసిల్ల వేములవాడ నవంబర్ 29 (ప్రజాతీర్పు, ప్రతినిధి, టి. ఎన్. స్వామి):**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతానికి సహకరించాలని ఎస్ఎఫ్ఐ మల్లారపు ప్రశాంత్ కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వరుసగా ఫుడ్ ఫాయిజన్ ఘటనలు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదు. విద్యార్థులు చనిపోతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు,గురుకులాలు సమస్యలతో సతమతం అవుతున్నాయి. రక్షణ కరువై, పర్యవేక్షణ లేకుండా పోతున్నాయి. రాష్ట్రంలో ముఖ్యమైన విద్యారంగానికి మంత్రి లేకుండానే 1 సంవత్సరం గడిచిపోతుంది. ఈ సమస్యలు పై కనీసం సమీక్ష చేసే పరిస్థితి రాష్ట్రంలో లేకుండా పోయింది. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 30న ప్రభుత్వ పాఠశాలల బంద్ ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తుంది. తక్షణమే ముఖ్యమంత్రి విద్యాశాఖ, వసతిగృహాలు,గురుకులాలు, కెజిబివిల సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది. విద్యాశాఖ మంత్రి ని నియమించాలని డిమాండ్ చేస్తోంది. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్యపై ఎస్ఎఫ్ఐ పోరాడుతుంది. 30న రాష్ట్ర వ్యాప్తంగా బంద్ జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిస్తుంది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సామల్ల సాయి భరత్, కడారి శివ, విద్యార్థులు అఖిల్, రాఖి ,అబ్దుల్ ,మనీష్, సలావుద్దీన్, సాత్విక్, శ్రీ హర్షిత, శ్రీజ ,అక్షయ, రుచిత, వర్షిని, తదితరులు పాల్గొన్నారు.




## కొత్తకొండ వీరన్న ఆలయ అభివృద్ధి నా ధ్యేయం

### రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**భీమదేవరపల్లి నవంబర్ 29(ప్రజాతీర్పు విలేఖరి )**

కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు శుక్రవారం నాడు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ లోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయం పక్కనే కల కొండపైకి 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మెట్ల మార్గానికి ఆయన శంకుస్థాపన చేశారు అనంతరం దేవాలయం సమీపంలో నిర్మించిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామస్తులతో మాట్లాడుతూ పాము ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తున్నామని డిసెంబర్ నెల చివరి కల్లా పూర్తిస్థాయిలో రైతుల రెండు లక్షల రుణమాఫీని అమలు చేసి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ మొదలైందని త్వరలోనే అందించడానికి సిద్ధంగా ఉన్నామని, నియోజకవర్గంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని అందుకుగాను నిరుపేదలను గుర్తించడంలో ప్రభుత్వ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు

**వీరభద్రుని సన్నిధిలో మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు**

కొత్తకొండలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు



# నేర విచారణ మరింత సమర్ధవంతంగా ఉండాలి...!





### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.,ఐపీఎస్.,

### రౌడి షీటర్స్,హిస్టరీ షీటర్స్ పై నిరంతరం నిఘా ఉంచాలి.

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలి.

**రాజన్న సిరిసిల్ల వేములవాడ నవంబర్ 29 (ప్రజాతీర్పు, ప్రతినిధి, టి. ఎన్. స్వామి):**

వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో శుక్రవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు నేర సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...నేర విచారణ మరింత సమర్ధవంతంగా చేయడంతో పాటు కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా సమర్ధవంతంగా పని చేయాలని,పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.పోలీస్ శాఖ వినియోగిస్తున్నా సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ నేరాలపై నిఘా పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**రౌడీ షీటర్స్,హిస్టరీ షీటర్స్ లపై నిరంతర పర్యవేక్షణ.**

వివిధ నేరాల్లో నిందుతులుగా ఉండి షీట్లు తెరువబడి వారు విధిగా పోలీస్ స్టేషన్‌కి హాజరు కావాలని లేని పక్షంలో బైండోవర్ చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్ల,హిస్టరీ షీటర్స్‌ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీషీట్స్ తెరవాలని ఆదేశించారు.

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలు,అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలి.**

జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను,కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ గంజాయి రవాణా పకడ్బందీగా నియంత్రించాలన్నారు.అక్రమ కార్యకలాపాలు అయిన పేకాట,గుడుంబా, పిడిఎస్ రైస్,వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయాలని అన్నారు.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా ఉంచి వారిపై కేస్లు నమోదు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, ఎస్.ఐ లు ,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్ కు ఘన సన్మానం...!

### సన్మానించిన కరీంనగర్ జిల్లా మేదరి సంఘం నాయకులు.

### మేదరి సంఘాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు.

**రాజన్న సిరిసిల్ల వేములవాడ నవంబర్ 29 (ప్రజాతీర్పు, ప్రతినిధి, టి.ఎన్. స్వామి):**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన కనికరపు రాకేష్ ను వారి నివాసంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా మేదరి సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు మధిర రవీందర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మేదరి కులాన్ని పాలకులు గుర్తించలేదని, గత ప్రభుత్వాలు సంచార జాతులుగా గుర్తించబడ్డ మేదరి కులాన్ని పట్టించుకోకపోవడం, రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించకపోవడం చాలా బాధాకరమని, ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మేదరి ముద్దుబిడ్డ రాకేష్ ను వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియమించడం సంతోషకరమైన విషయమని, మేదరి కులాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలిపి రెడ్డి లచ్చయ్య మాట్లాడుతూ వెనుకబడిపోయిన మేదరి కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడంతోపాటు, మేధరులను అన్ని రంగాల్లో ఆదుకోవాలని, వేములవాడ పట్టణంలో మేదరి కులానికి సంబంధించిన ట్రస్ట్ ఏర్పాటుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహాయ సహకారాలు అందించాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మధిర రవీందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏకుల రాజనర్సు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలిపిరెడ్డి లచ్చయ్య, కరీంనగర్ నగర అధ్యక్షులు ఏకుల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిలువేరి సత్యనారాయణ, కొత్తపల్లి మండల అధ్యక్షులు మదిరె గంగాధర్, జిల్లా కోశాధికారి పర్ల రాజు, జిల్లా ప్రచార కార్యదర్శి మొలుగూరి కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు సూరినీడ బాలయ్య, పట్టణ గౌరవ అధ్యక్షులు పిట్టల కనకయ్య, పట్టణ కోశాధికారి ఎనగందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడిల్లోని చిన్నారులకు మెరుగైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి

### జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.



**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ నవంబర్ 29)**

అంగన్వాడిల్లోని చిన్నారులకు మెరుగైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ న్యూట్రి గార్డెన్స్‌లో పెంచిన ఆకు కూరలు, కూరగాయలను చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేయు ఆహార తయారీకి ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్క చిన్నారి, గర్భిణి, బాలింతకి మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, ఇతర పోషకాలను అందించి రక్తహీనత, ఎదుగుదల లోపం వంటి సమస్యలను నియంత్రించాలని తెలిపారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతాన్ని అందించాలన్నారు. అంగన్వాడీలలో అందించే మధ్యాహ్నం భోజనానికి నాణ్యమైన సరుకులను మాత్రమే వాడాలని తెలిపారు. వస్తువుల గడువు తేదీ ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. చిన్నారులకు స్వచ్ఛమైన త్రాగునీరుని అందించాలని తెలిపారు. మండలాల వారిగా అంగన్వాడీల్లో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్స్, సామ్, మామ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేసి నివేదికలను అందజేయాలన్నారు. అంగన్వాడీల పరిసరాలలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎసిడిపిఓ నాగలక్ష్మి, సిడిపిఓలు నాగమణి, సరిత, సరోజినిలు, జిల్లా సమన్వయకర్త నిరంజన్ రెడ్డి, అన్ని మండలాల అంగన్వాడి పర్యవేక్షకులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## లకావత్ వెంకటేశ్వర్లు కి అభినందనల వెల్లువ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా లకావత్ వెంకటేశ్వర్లు ని నియామకం చేసిన సందర్బంగా శుక్రవారం ఈరోజు స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి పార్క్ ప్రాంగణంలో గ్రీన్ భద్రాద్రి, లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో భారీ ఎత్తున అభినదన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వక్తలు మాట్లాడుతూ, లకావత్ వెంకటేశ్వర్లు గతం లొ దిశ కమిటీ సభ్యులుగా, తదుపరి ఆత్మ కమిటీ చైర్మన్ గా, ప్రస్తుతం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా అంచెలంచెలుగా ఎదుగుతున్న, అందరితో సౌమ్యంగా ఉంటు, అందరి మనిషిగా ఉంటున్న ఎల్. వి. మున్ముందు మరిన్ని పదవులు అలంకరించాలని, భవిష్యత్తులో భద్రాచలం అభివృద్ధికి తోడ్పాటు అందిచాలని, ఈ యొక్క గౌరవం భద్రాద్రి పౌరులదరికి దక్కినట్లు భావిస్తున్నామని వక్తలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యశోద రాంబాబు, పాకాల దుర్గాప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్స్పక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామలింగేశ్వరరావు, గ్రీన్ భద్రాద్రి ఫాస్ట్ ప్రెసిడెంట్ లయన్ డా. గోళ్ళ భూపతి రావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు బాలాజీ , కార్యదర్శి సాగర్, కోశాధికారి శ్రీనివాస్, ప్రభాకర్ గుప్తా, హరిశ్చంద్ర నాయక్, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్తిరాజు, పరిమి సోమశేఖర్, పల్లింటి దేశప్ప, సోమరౌతు శ్రీనివాస్, గాదె మాధవ రెడ్డి, ఎస్. కె. అజీమ్, చారుగుళ్ళ శ్రీనివాస్, పామరాజు తిరుమలరావు, కామిశెట్టి కృష్ణార్జునారావు రావు, చారుగుళ్ళ వెంకట నాగ భూషణం, కుంచాల రాజారాం, రఫి, పరిటాల విష్ణుమూర్తి, వీధుల రాంబాబు పూసం రవి కుమారి, బ్రహ్మారెడ్డి, సానికొమ్ము శంకర్ రెడ్డి, అన్నె రాంరెడ్డి, కొత్తా రామకృష్ణ, వెంకటేశ్వర రావు, మొతుకూరి వీరయ్య, భూషణ రావు, చలపతిరావు, బన్సీలాల్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బిఆర్‌టియు కెవి జిల్లా యూనియన్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక లోని ఐటిసి పిఎస్పీడీ బి ఆర్ టి యు కెవి యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ జన్మదిన వేడుకల్లో బి ఆర్ టి యు కెవి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థ సేవకు నిదర్శనం, కార్మిక పక్షాన పోరాడే నాయకుడు శంకరన్న ని కొనియాడారు .ఈ కార్యక్రమంలో అజామ్,వెంకటేశ్వరులు,వేణుగోపాల్,సతీష్, పోటునర్సింహారావు, రాజశేఖర్రెడ్డి, సూర్యనార్యణ, రఘు, మురళి, దుర్గేష్, బాల్రెడ్డి, వెంకటనారాయణ, ముస్తఫా, వెంకటరెడ్డి, గోపాల్, కొండా రెడ్డి, రఫీ, దామోదర్, శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీజడ్సీ ఆదేశాల మేరకు రహదారి పరిశీలన

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

శేరిలింగంపల్లి జోన్ శేరిలింగంపల్లి సర్కిల్ నల్లగండ్ల హుడా లే ఔట్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు రాక్ గార్డెన్ రహదారిని పరిశీలించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం సర్కిల్ ఇంజనీర్ విభాగానికి చెందిన అధికారుల బృందం రోడ్డును పరిశీలించింది. శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ విలాక్షి ఆధ్వర్యంలోని ఇంజినీరింగ్ విభాగపు అధికారులు రహదారి స్థితిగతులను అంచనా వేశారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు రోడ్డు దెబ్బతినడం, రహదారి మధ్యలో మట్టి వల్ల పడుతున్న సమస్యలను వారు సదరు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హుడా కాలనీ లే ఔట్ రహదారి 100 ఫిట్ల రోడ్డు అయినప్పటికీ.. రహదారి సరిగా లేకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను ఇంజినీరింగ్ బృందానికి తెలియజేశారు. ఈ సందర్భంగా డీఈ విలాక్షి మాట్లాడుతూ..రాక్ గార్డెన్ రహదారి మరమ్మత్తులపై జడ్సీ ఉపేందర్ రెడ్డి ప్రత్యేక కేర్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ విలాక్షితో పాటు ఏఈ రషీద్,వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్,నల్లగండ్ల హుడా కాలనీవాసులు ఉన్నారు.



## మీ కోసం మేమున్నాం కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వకృత్వ పోటీలు

### విజయ వంతంగా వకృత్వ పోటీలు

### విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన సిఐ రాజు వర్మ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**

సమాజంలో అంతరించి పోతున్న మానవత్వ విలువలను పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో మార్పు తీసుకు రావాలనే లక్ష్యంతో మీకోసం మేమున్నాం టీమ్ ఆధ్వర్యంలో చర్ల మండల స్థాయి లో సామాజిక సేవలు బిమానవత్వ విలువలు బిమన భాగస్వామ్యం అనే అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు.చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో మండలం లో 13 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు చర్ల సీఐ రాజు వర్మ మొదటి బహుమతి ప్రదానం చేశారు.ద్వితీయ బహుమతి ని చర్ల యంపీడీఓ ఈదయ్య, తృతీయ బహుమతి మీకోసం మేమున్నాం కమిటీ తరపున మురళి, ప్రకాష్, ఆంజనేయులు, అందచేశారు. కన్సోలేషన్ బహుమతి ని పున్నం రామకృష్ణ, భవ్య లు అందచేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రాజు వర్మ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల చదివే నాటి నుంచే ఓ లక్ష్యం పెట్టుకుని చదువుతో పాటు క్రీడల్లో, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.ఎవరైనా యూపీఎస్ పరీక్షలకు సిద్ధం అవుతారో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.పలువురు వక్తలు మీకోసం మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో నిరహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ సమావేశంలో మీకోసం మేమున్నాం కమిటీ చైర్మన్ నీలి. ప్రకాష్, అరవింద్, గొట్టిపాటి. శ్రీనివాస్ లుపాల్గొన్నారు.వకృత్వ పోటీలకు డీపీ దాస్, లక్ష్మణ్, కొంగూరు. నరసింహారావులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



# తెలంగాణ జర్నలిస్టులందరికీ 10 లక్షల జీవిత బీమా కల్పించాలి...!

**టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని.**

**జిల్లా నూతన అధ్యక్షుడిగా చౌహాన్ సుదర్శన్ , ప్రధాన కార్యదర్శిగా జి సురేష్ , కోశాధికారిగా సిహెచ్ నరసయ్య తో పాటు 10మందితో జిల్లా కార్యవర్గం ఎన్నిక.**

**చిన్న పత్రికల బలోపేతానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.**




**రాజన్న సిరిసిల్ల వేములవాడ నవంబర్ 29 (ప్రజాతీర్పు, ప్రతినిధి, టి. ఎన్. స్వామి):**

ఉద్యోగ నిర్వహణలో ప్రతినిత్యం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న పాత్రికేయుల కోసం 10 లక్షల రూపాయల జీవిత బీమా సదుపాయం కల్పించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ నిర్మల్ జిల్లా జర్నలిస్టుల కమిటీ సమావేశం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. సమావేశంలో నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ, ప్రతి నిత్యం సమస్యలతో సహజీవనం చేస్తూ ప్రజా సమస్యల పట్ల పరిష్కారానికి ప్రయత్నిస్తున్న జర్నలిస్టుల రక్షణ కోసం 10 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించి జర్నలిస్టులను ఆదుకోవాలని, అలాగే దాడులకు గురవుతున్న జర్నలిస్టుల రక్షణ కోసం జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించి అమలు చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు, వేధింపులు, మరియు తప్పుడు కేసుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఈ చట్టం తీసుకురావాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల కీలక ప్రసంగం చేశారు. సంస్థ యొక్క లక్ష్యాలు, విధి విధానాలను సభ్యులకు వివరించారు. సమావేశంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజ్ పటేల్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చింతలపల్లి బాపురెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జి నరేష్, ఉపాధ్యక్షులు డి రాజేందర్ హాజరయ్యారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. చిన్న పత్రికలను తక్షణమే గుర్తించి, వాటిని ఎమ్పానెల్‌మెంట్‌లో చేర్చాలని కోరారు. 2. సంక్షేమ పథకాలలో యూనియన్ల జోక్యం లేకుండా చూడాలి జర్నలిస్టుల సంక్షేమ పథకాలు నేరుగా అమలు చేయాలని, యూనియన్ల జోక్యం లేకుండా వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. 3. మీడియా రంగానికి ప్రత్యేక పాలసీ రూపొందించి, జర్నలిస్టుల భద్రత, పత్రికా స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. 4. మీడియా ఉద్యోగుల సంక్షేమం జర్నలిస్టుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన బీమా, పెన్షన్, మరియు ఇతర ఆర్థిక సహాయ కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు.

**జిల్లా కార్యవర్గం :**

అధ్యక్షుడు చౌహాన్ సుదర్శన్, , ఉపాధ్యక్షులు: టి రాజేందర్, జే హనుమాన్లు, టీ ఫణిందర్, ప్రధాన కార్యదర్శిగా జి సురేష్, సంయుక్త కార్యదర్శి గా టీ మధుకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే సూర్యకాంత్, కోశాధికారిగా కార్యవర్గ సభ్యులుగా షేక్ కాజా మోహినుద్దీన్ , ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## 25.16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**

ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మణుగూరు రూట్ వాచ్ మరియు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఒరిస్సా నుంచి హైదరాబాద్ కు తరలిస్తున్న ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 25.16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు 6,25,000/- ఉంటుందని తెలిపారు. వారి వద్ద నుంచి 01 మొబైల్ ఫోన్, 1 ద్విచక్ర వాహనం కూడా స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఎస్‌హెచ్‌ఓ మను గురులకు అప్పగించారు. అరెస్టు చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. తెరపతి కళ్యాణ్ నివాసం: మిర్యాలగూడ, 2) చట్టం నివాసం: ఖమ్మం. ఈ రైట్ లో ఎస్. రమేష్ (పీ, ఇసి), ఎంఏ కరీం హెచ్ సి, కే సుధీర్ (ఇసి), టి వెంకట్ (ఇసి), పి విజయ్ (ఇసి), పీ హరీష్ (ఇసి), కె. ఉపేందర్ (ఇసి) పాల్గొన్నారు,



## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కొప్పరపు రాజు రెడ్డి ప్రజాతీర్పు ప్రతినిధి బెజ్జంకి**

మండలంలోని బేగంపేట్, తలారోనిపల్లె, దేవక్కపల్లి, నరసింహులపల్లి, లక్ష్మీపూర్, గ్రామాల్లో 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను ఎనిమిది లక్షలతో అంగన్వాడి కేంద్రం భవనం కాంపౌండ్ వాల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నామని రెండు లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. మహిళా సాధికారిక పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువర శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు మచ్చ కుమార్, పులి సంతోష్, చెప్యా ల శ్రీనివాస్ గౌడ్ బైర సంతోష్, జెల్ల ప్రభాకర్, మధుసూదన్ రెడ్డి, సాదిక్ కుంట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభ విజయవంతం చేద్దాం

**హైదరాబాద్ ప్రజా తీర్పు :-**

డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభ విజయవంతం చేయాలని దసారం బస్తి మాల సంఘం నేతలు తెలిపారు. బుధవారం రాత్రి దసారం బస్తి లో మాలల సింహగర్జన విజయవంతం చేయాలని సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్గీకరణ వెతిరేక పోరాట సమితి చైర్మన్ రాజు వస్తాద్, చెన్నయ్య, అంబేద్కర్ స్టాచు ప్రొటెక్షన్ సెల్ గుడిమల్ల వినోద్ కుమార్ , జై భీమ్ సేన బాల్వంత్ ,SCVPS కో ఛైర్మెన్ మన్నే శ్రీధర్, ఉత్తమ్ సుమన్, సర్వయ్య పాల్గొని మాలల సంక్షేమం, హక్కులు గురించి తెలిపారు అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ పి రాజ్ నర్సింగ్, ఎస్, నర్సింగ్ రావు, ఎస్. దర్శన్, ఎస్ ఆర్ ప్రసాద్, పి చంద్రశేఖర్, ఎస్ గిరి, జి ఫణి కుమార్, పి వీరేష్, జి ప్రవీణ్ కుమార్, పి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ అజెండా: KLR

**మహేశ్వరం నియోజకవర్గ (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**



పేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ నినాదమని మరోసారి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. రేపు మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు, బడంగ్ పేట కార్పొరేషన్, కందుకూరు - మహేశ్వరం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ శాఖామాత్యులు శ్రీధర్ బాబు గారు శ్రీకారం చుట్టనున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి KLR తెలిపారు. పేదలకు ఖర్చులు తగ్గించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పోలీస్ వ్యవస్థ పటిష్టానికి సొంత భవనాలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారని లక్ష్మారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు కందుకూరు చందుపట్ల నర్సింహారెడ్డి గార్డెన్స్ లో ప్రెస్ మీట్. కావున మీడియా ప్రతినిధులు పాల్గొనాలని మనవి.

## విద్యార్థినిలతో గోనె సంచులు మోయిస్తున్న వార్డెన్.

**ఆహారాల నాణ్యత పై కలెక్టర్ స్పెషల్ డ్రైవ్ జరుగుతున్నా లెక్కచేయకుండా వసతి గృహంలోకి బయట తినుబండారాలకు అనుమతి**

**ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా మారని వార్డెన్ ప్రవర్తన.**

**బయట ఫుడ్‌ని వసతి గృహంలోకి అనుమతిస్తున్న వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి.**

**పట్టణ తాసీల్దార్ స్పందించి హాస్టల్‌ని విజిట్ చేయాలి.**

**పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**



పాల్వంచ పట్టణంలో ఎస్టీ ఆశ్రమ పాఠశాల గర్ల్స్ హాస్టల్ ను పి డి ఎస్ యు నాయకులు సందర్శించే సందర్భంలో విద్యార్థులతో గోనె సంచులు మోపించే తీరును పి డి యస్ యూ నాయకులు తీవ్రంగా ఖండించారు. వాటిని వెలుగులోకి తీసుకువచ్చి అధికారులతో మాట్లాడిన సందర్భంగా పి డి ఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వి జిల్లా నాయకులు మునిగేల శివ ప్రశాంత్ లు మాట్లాడుతూ. రాష్ట్రంలో ఇప్పటికే ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు మృతి చెందుతుంటే. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ సీఎం సతీ గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు భోజన నాణ్యత గురించి, స్టోర్ రూమ్, వంట రూమ్ శుభ్రంగా ఉందా లేదా, వంట పాత్రలు ఏ విధంగా ఉన్నాయి అని జిల్లా కలెక్టర్లకి ఆదేశాలు ఇచ్చి మండల తాసిల్దార్లు, మండల ఎంపీడీవోలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేస్తున్నా జిల్లా కలెక్టర్ కార్యాలయం కూత వేటు దూరంలో ఉన్న పాల్వంచ ఎస్టి గర్ల్స్ ఆశ్రమ వసతి గృహం లోకి తిను బండారాలు అమ్మే వారికి ఏదేచ్ఛగా అనుమతులు ఇచ్చి విద్యార్థుల ఆరోగ్యల పట్ల వార్డెన్ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా మంత్రులు జిల్లా కలెక్టర్లు ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయకుండా ఉండే విధంగా వార్డెన్ వ్యవహార శైలి ఉందని వారు అన్నారు. తిను బండారాలు ఉన్న గోనె సంచలను విద్యార్థులతో ఎందుకు మోపిస్తున్నారని విద్యార్థి సంఘ నాయకులు ప్రశ్నించగా అంతా నా ఇష్టమని అడగడానికి మీరు ఎవరు అని అంటూ తన దురుసుతనంతో సమాధానాలు ఇచ్చిందని వారు తెలిపారు. తక్షణమే పాల్వంచ ఎటిడబ్ల్యుఒకి ఈ విషయాన్ని సం ఘం నాయకులు తెలియజేసినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని వారు అన్నారు. ఫుడ్ పాయిజన్ అయి ఒకపక్క విద్యార్థులు మరణిస్తుంటే హాస్టల్స్ పరిశీలన పై స్పెషల్ డ్రైవ్ ఒకపక్క జరుగుతున్నా బయట నుండి తినుబండారాలను వసతి గృహంలోనకి రాకూడదని అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ ఈ వార్డెన్ తన ఇష్టానుసారంగా బయట వ్యక్తులకు అనుమతి ఇచ్చి విద్యార్థుల ఆరోగ్యాల ముప్పుకు కారణం అవుతుందని వారు తెలిపారు. అధికారులు ఇచ్చిన ఆదేశాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే విషయాల పట్ల స్థానిక అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పాల్వంచ గిరిజన ఆశ్రమ గర్ల్స్ పాఠశాల వార్డెన్ పై ను తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు అన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి....!

**సిఐటియు ఆధ్వర్యంలో**

**ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, నవంబర్ 29**

అప్పులు చేసి విద్యార్థులకు అన్నం వండి పెడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంఈఓ తోటమల్ల రమా కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నకరికంటి నాగరాజు మాట్లాడుతూ నెలల తరబడి మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు విడుదల చేయకపోతే విద్యార్థులకు భోజనాలు ఎలా ఉండి పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు మెనూని సక్రమంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేస్తారే తప్ప కార్మికుల సమస్యలు పట్టవా అని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రతతో పాటు ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పిస్తూ నెలకి 26వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లించాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులను ఉద్దేశించి ఎంఈఓ రామ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అజయ్ కుమార్ మధ్యాహ్న భోజన కార్మిక నాయకులు పిలక శివకుమారి బేబీ పాప కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.




## లింగ నిర్ధారణ పరీక్షలు డయాగ్నస్టిక్ టెక్నిక్‌లను అమలు చేయకూడదని హెచ్చరించిన డి ఎమ్ ఎచ్ ఓ డాక్టర్ రఘునాథస్వామి స్వామి

**మేడ్చల్ జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి :-**

శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో డాక్టర్ రఘునాథ స్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మరియు జిల్లా స్థాయి సలహా కమిటీ చైర్మన్, డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైసొరీ కమిటి ( DLAC) సభ్యులతో సమావేశమయ్యారు. గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టం 1994 రూల్స్ 1996క్రింద అల్ట్రాసౌండ్ సోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు మరియు ఇమేజింగ్ కేంద్రాల స్థాపన కోసం దరఖాస్తు చేస్తున్న కొత్త సంస్థల ఆమోదంపై చర్చించడానికి సమావేశం అయ్యారు . వారు ఇప్పటికే ఉన్న కేంద్రాల పునరుద్ధరణలను కూడా ప్రస్తావించారు మరియు చట్టం యొక్క ఖచ్చితమైన అమలు కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. జిల్లా స్థాయి సలహా కమిటీ తాజా సంస్థలు మరియు పునరుద్ధరణల కోసం దరఖాస్తులను చర్చించి ఆమోదించింది. గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టం1994 రూల్ 1996 యొక్క కచ్చితంగా అమలు కోసం కమిటీ సభ్యులు విలువైన సలహాలు అందించారు. సమావేశాన్ని ఉద్దేశించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. టి. రఘునాథ్ స్వామి మాట్లాడుతూ ప్రైవేట్ హెల్త్ ఫెసిలిటీలో ఇప్పటివరకు నమోదు కాని సౌకర్యాలలోలింగ నిర్ధారణ నిర్వహించడం లేదా సహాయం చేయడం చట్టరీత్యా నేరమని ఆయన తెలిపారు, అబ్బాయి లేదా అమ్మాయి లింగ ఎంపిక నిషేధించబడింది మరియు చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్‌కు బాధ్యత వహిస్తుంది. అంతే కాకుండా, చట్టంలో పేర్కొన్న వాటి కోసం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం లింగ నిర్ధారణ పరీక్షలు డయాగ్నస్టిక్ టెక్నిక్‌లను అమలు చేయకూడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో,,,. డాక్టర్ గురు భార్గవ్ శిశువైద్యుడు, సభ్యుడుడాక్టర్ స్వర్ణలత, గైనకాలజిస్ట్, సభ్యురాలుడాక్టర్ డి స్వర్ణలత, జన్యు శాస్త్రవేత్త, సభ్యురాలు హైమవతి, ఎన్జీఓ, సభ్యురాలు సమావేశానికి హాజరయ్యారు.



# చలి కౌగిలిలో... విద్యార్థుల విన్యాసాల మధ్య

## అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా సమరం

## ఇకముందు జరిగే క్రీడోత్సవాలకు చేయూతనిస్తా

## ఆదరణ లేక మరుగున పడుతున్న క్రీడాకారుల ప్రతిభ

## ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్ వెల్లడి



**తిరునగరి ఆంజనేయస్వామి ప్రజా తీర్పు ప్రతినిధి హుజురాబాద్**

68వ రాష్ట్రస్థాయి అండర్ 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ క్రీడోత్సవాలు హుజురాబాద్ పట్టణ హైస్కూల్ మైదానంలో శుక్రవారం వేలాదిమంది విద్యార్థిని విద్యార్థుల కోలాహలం మధ్య అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ హాకీ టోర్నమెంట్ లో పాల్గొనడానికి నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఖమ్మం మెదక్ మహబూబ్నగర్ నల్గొండ రంగారెడ్డి వరంగల్ హైదరాబాద్ తదితర పాత పది జిల్లాల నుండి హాకీ క్రీడాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు ప్రముఖ సామాజికవేత్త... రాజకీయ విశ్లేషకులు... రక్తదాన ప్రదాత సబ్బని వెంకట్ తెలిపారు. మొదటి రోజు ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన వెంకట్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుండి అనేక క్రీడలకు హుజురాబాద్ పాత తాలూకా కేంద్రబిందువుగా నిలుస్తున్నదని... హాకీ.. కబడ్డీ.. కోకో క్రీడాంశాలలో హుజురాబాద్ ప్రతిష్ట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులను దాటి జాతీయస్థాయికి ఇనుమడిచిందని... ఇప్పటికి కూడా హుజురాబాద్ పాత తాలూకాలోని ప్రతి గ్రామంలో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులు క్రీడారంగం పట్ల మక్కువ చూపుతున్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించలేకపోవడం... ప్రభుత్వం నుండి సరైన ప్రోత్సాహం లభించకపోవడం... పాఠశాలలలో క్రీడలకు సంబంధించి వెన్ను తట్టి ముందుకు నడిపించేవారు అంతకన్నా లేకపోవడం వల్ల విద్యార్థిని విద్యార్థుల ప్రతిభ "అడవి కాచిన వెన్నెల" మాదిరిగా తయారైందని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలలో హుజురాబాద్ పాత తాలూకాకు ఎంతటి చరిత్ర ఉన్నదో.... అంతే స్థాయిలో క్రీడా విభాగంలో కూడా అంతటి ఘన చరిత్ర ఉన్నదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమ పిల్లలు క్రీడల పట్ల ఉత్సాహంతో ఉన్నారని తెలిసినప్పటికీ తల్లిదండ్రులు తమ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఏమి చేయలేక నిరుత్సాహాన్ని వ్యక్త చేయవలసిన పరిస్థితులు ఎదురు కావడం దారుణమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతి బడ్జెట్లో క్రీడారంగానికి అధిక కేటాయింపులు కేటాయించి... ఆ నిధులను సమర్థ వంతంగా క్రీడాకారుల అభ్యున్నతి కోసం ఖర్చు చేసినట్లయితే హుజురాబాద్ లోనే కాకుండా రాష్ట్రంలోనే ఆణిముత్యాలు లాంటి వేలాదిమంది క్రీడాకారులు తెరపైకి రావడానికి ఆస్కారం ఉంటుందన్న నగ్న సత్యాన్ని ప్రభుత్వాలు గుర్తిస్తే మంచిదని ఆయన సలహా ఇచ్చారు. హుజురాబాద్ పట్టణంలో రాష్ట్రస్థాయి హాకీ క్రీడోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించామని... అందుకు మీ నుండి తగిన సహ కారం ఆశిస్తున్నామని నిర్వాహకులు కోరడంతో ఏ మాత్రం తట పటాయించకుండా తన శక్తి మేరకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించడమే కాకుండా... వెంటనే అందించడం కూడా జరిగిందని... ఇకముందు హుజు రాబాద్‌లో ఎలాంటి టోర్నమెంట్ జరిగినను తాన సొంతంగా ఆర్థికంగా ఆదుకుంటానని... హుజురాబాద్ ప్రాంత ( సిరిసపల్లి ) వాసిగా ఇది తన కర్తవ్యం అని సబ్బని వెంకట్ ప్రకటించారు. ఈ ప్రాంత విద్యార్థిని విద్యార్థులు.. క్రీడాకారులు ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా విద్యతోపాటు ప్రతినిత్యం క్రీడలను ప్రాక్టీస్ చేయాలని... మంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఎప్పుడూ కూడా ప్రోత్సాహం లభిస్తుందని... నిరాశను అలసత్వాన్ని దూరం చేసుకుని ఆటుపోట్లను తట్టుకుంటూ ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ ప్రాంతంలో ఒకనాడు క్రీడాకారులుగా రాణించిన వారందరూ ఆ తరువాత రాజకీయాలలో కూడా రాణిస్తున్నారని... అలాంటివారు స్వార్థాన్ని విడనాడి నేటితరం క్రీడాకారులను చేతనైనంత మేరకు ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు.

**అలరించిన అద్భుత విన్యాసాలు**

రాష్ట్రస్థాయి హాకీ క్రీడోత్సవాల మొదటి రోజు కార్యక్రమం శుక్రవారం రాత్రి రంగ రంగ వైభవంగా... కలర్ ఫుల్ గా కొనసాగింది. హుజురాబాద్ ప్రాంతానికి చెందిన అనేక పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్యాలు ఆ బాలగోపాలాన్ని విశేషంగా ఆకర్షించాయి. నృత్యాలకు అదనపు ఆకర్షణగా వీనుల విందైన సౌండ్ సిస్టం తోడవడంతో ఈ అద్భుతమైన విన్యాసాలను తిలకించడానికి చలి కాలపు.. చలిని సైతం లెక్కచేయకుండా పట్టణంలోని క్రీడాకారులు... విద్యార్థిని విద్యార్థులు... మహిళలు... ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో హుజురాబాద్ హైస్కూల్ ప్రాంగణం ఫ్లడ్ లైట్ల వెలుతురుల మధ్య... సాయం సంధ్యా సమయం లో ఇంద్రధనస్సుల తలపింప చేసింది. ఇలాంటి అద్భుతమైన సన్నివేశాలకు... క్రీడా వేదికలకు హుజురాబాద్ పట్టణం తరచుగా కేంద్ర బిందువు కావాలని సబ్బని వెంకట్ ఆకాంక్షించారు. హృదయం ఉండి... స్పందించే మనస్తత్వం కలిగిన ప్రతి ఒక్కరూ ఇలాంటి క్రీడోత్సవాలకు ఆర్థికంగా చేయూతను అందించినట్లయితే మన కళ్ళ ముందే మన ప్రాంతానికి చెందిన ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులు క్రీడలలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని... అలాంటి అద్భుత మైన సన్నివేశాలను తిలకించడం కోసమైనా మనం దాతలుగా మారవలసిన అవసరం ఎంతైనా ఉందని సబ్బని వెంకట్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి హాకీ క్రీడోత్సవాలను ఈరోజు ఉదయం హుజురాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమల గౌడ్ ప్రారంభించి క్రీడాకారులకు శు భాకాంక్షలు తెలిపిన విషయం విధితమే.



## చదువు కు పేదరికం అడ్డు కోవొద్దు...

### మాజీ మంత్రి హరీష్ రావు,,,,

**సిద్దిపేట జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి,,,,**

సిద్దిపేట జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ..ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతు..సమాజాన్ని మార్చే సామాజిక వేత్తలు ఎదగాలి. చదువు కు పేదరికం అడ్డు కోవొద్దు...- నియోజకవర్గం లోని పేద విద్యార్థుల కు వైద్య విద్యకు ఆర్థిక సహాయాన్ని అందిస్తా...ప్రభుత్వ మెడికల్ కళాశాల లో సిటు వచ్చిన విద్యార్థులకు ఫీజు నేనే కడ్త... ఫీజు నా బాధ్యత... డాక్టర్ అయ్యేది మీ బాధ్యత...బాసర ట్రిబుల్ ఐటి లో సిటు సాధించిన విద్యార్థుల కు ట్యాబ్ గిఫ్ట్ ఇస్తా... గత 5 సంవత్సరాల స్ఫూర్తి తో పది లో జిల్లా అగ్రస్థానంలో నిలపాలి..- అన్నింటిలో సిద్దిపేట ఆదర్శం...సైన్స్ పెయిర్ లో రాష్ట్రం లో 1733 ప్రదర్శన లు చేసిన జిల్లా గా సిద్దిపేట నెంబర్ వన్ గా నిలిచింది..- చాలా సంతోషం గా ఉంది సైన్స్ ఫైర్ లో విద్యార్థుల ప్రదర్శన ఎంతో చైతన్యం ను కలిగించాయ్...- ఒక్కోక్కరిలో ఒక్కో సింటిస్ట్ కనపడ్డారు..చాలా వరకు వ్యవసాయ అదారిత ప్రదర్శన లు చేయడం చాలా సంతోషం గా ఉంది .- రాత్రి పూట పొలం వద్ద కరెంట్ పోతే రైతు లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాంకేతిక ఫర్టిలైజసర్స్ ఉపయోగించే విధానం ప్రదర్శన చాలా బాగుంది..- వరదలు వస్తే అలెర్ట్ చేసే అలారం.. సోలార్ విద్యుత్ వినియోగం పై మంచి ప్రదర్శన చేశారు.- ప్రభుత్వ పాఠశాల లో చదివే విద్యార్థులు ప్రయివేట్ స్కూల్స్ తో పోటీ పడుతున్నారు..- విద్యార్థులు ఇంగ్లిష్ లో మాట్లాడటం చాలా సంతోషం గా ఉంది.. సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు పొందే వారు అన్ని నైపుణ్యాలు ఉన్నపటికి వారి ప్రదర్శన లోపం తో మంచి ఉద్యోగాలు పొందలేక పోతున్నారు..- అలాంటి వారికి ఇలాంటి ప్రదర్శన లు ఎంతో ఉపయోగ పడుతాయి....- విద్యార్థులు నేటి రోజుల్లో సోషల్ మీడియా, ఫోన్ లు డ్రగ్స్ వంటి వాటికీ బానిస అవుతున్నారు..- అలాంటి వాటికీ దూరం ఉండి మీ చదువు పై దృష్టి పెట్టాలి...- 100 రోజుల్లో 10 తరగతి పరీక్షలు ఉన్నాయ్- ఇప్పటి నుండే టీవీలు, ఫంక్షన్స్ లు, ఫోన్ లు బంద్ చేయాలి..- 10/10 సాదించిన విద్యార్థుల కు మంచి బహుమతి ఇస్తా... - వైద్య విద్య కు ఎక్కువ గర్ల్స్ ఆసక్తి చూపుతున్నారు...- పోలీస్ ఉద్యోగాలకు కెసిఆర్ మహిళ లకు 33శాతం రిజర్వేషన్ లు ఇచ్చాడు.- అందరు అన్నింటిలో రాణించాలి..

## గురుకుల పాఠశాలను సందర్శించిన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్

### ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులు, ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్లు - శ్రీరాములు అందెల

### ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ విద్యావ్యవస్థ మాత్రం మారడం లేదు - శ్రీరాములులి అందెల

**మహేశ్వరం నియోజకవర్గంప్రజా (తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నటువంటి కందుకూరు మండల గురుకుల పాఠశాలను లిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్‌లి గారు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ఏదో ఒక గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, మరి కొందరు ఆత్మహత్యకు పాల్పడుతూ మరణిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలో 51 విద్యార్థులను పొట్టన పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా సమీక్షించాలి, క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలి, ప్రతి గురుకులాలలో మంచినీటి సరఫరా కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి, స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశు భ్రంగా ఉంచేలా ఆదేశించాలి. జిల్లాలో ఉన్నటువంటి అన్ని గురుకుల పాఠశాలలకు జిల్లా కలెక్టర్ గారు స్థానికంగా ఉన్నటువంటి నాయకులతో కలిసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని శ్రీరాములు కోరారు. అనంతరం ప్రిన్సిపల్ గారు తమ గురుకుల పాఠశాల యొక్క ఇబ్బందులను, పరిస్థితులను శ్రీరాములు గారికి తెలియజేశారు ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్ గారికి, అడిషనల్ కలెక్టర్ గారికి, మున్సిపల్ కమిషనర్ గారికి విన్నపించిన తమ సమస్యలు తీరడం లేదని ప్రిన్సిపల్ తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి గారు, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్ గారు, సహకార బ్యాంకు డైరెక్టర్లు పెత్తుల పుల్లారెడ్డి, తోట ప్రతాప్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు రామ్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, మంత్రి మహేష్ ముదిరాజ్, జిల్లా బీజేవైఎం నాయకులు ఇల్లందుల సాయి సంతోష్, యాతం వెంకటేష్, కీసర శ్రీకాంత్ రెడ్డి, గడ్డం శ్రీకాంత్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పవన్ కుమార్, ప్రవీణ్ గౌడ్, మల్లెల మహేందర్, శివప్రసాద్ బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఛాంబర్లో ప్రజల ఆరోగ్యం మరియు భద్రతను పై సమావేశం

**మేడ్చల్ జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి :-**

జిల్లాలో ఆహార విషపూరిత సంఘటనల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తెలంగాణ ప్రభుత్వ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ మరియు ఫుడ్ (హెల్త్) అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించబడింది. ఈ సమావేశంలో భారత ఆహార భద్రతా మరియు ప్రమాణాల సంస్థ (%ఖీూూూ×%) ప్రతిపాదించిన ఫుడ్ సేఫ్టీ ఎమర్జెన్సీ రెస్పాన్స్ (%ఖీూజు=%) వ్యవస్థ అమలుపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమం ప్రజల ఆరోగ్యం మరియు భద్రతను కాపాడేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ (RRT) ఏర్పాటు ద్వారా ఆహార విషపూరిత సంఘటనలను సమర్థవంతంగా నిర్వహించడం మరియు నివారించడమే లక్ష్యంగా రూపొందించబడింది.

**రాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు:**

డా. విజయేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) –టీమ్ లీడర్, డా. టి. రఘునాథ స్వామి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (DMHO) – సభ్యులు, జగనాథం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ – సభ్యులు, డా. సునీత, DCHS, జిల్లా ఆసుపత్రి – సభ్యులు, విజయ కుమారి, జిల్లా విద్యాధికారి (DEO) – సభ్యులు, రాజనీ కార్, గురుకుల్ పాఠశాలల జిల్లా కమిషనర్ (DCO) –% సభ్యులు, వినోద్ కుమార్, సామాజిక సంక్షేమ / గిరిజన సంక్షేమ విభాగం ప్రతినిధి – సభ్యులు, డా. మల్లీశ్వరి, డిజిగ్నేటెడ్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ – సభ్యులు, అదనపు కలెక్టర్ అన్ని సంబంధిత అధికారుల మధ్య సమన్వయం అవసరమని, రాపిడ్ రెస్పాన్స్ టీమ్ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి వ్యూహాలను రూపొందించి, ఆచరణలో పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు మరియు అత్యవసర పరిస్థితులలో సమయోచిత మరియు సమర్థవంతమైన చర్యలను చేపట్టేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని తెలియచేసారు .



## సీఎంతో మాట్లాడి హుజూరాబాద్‌కు ఆస్ట్రో టర్ఫ్ కోర్టు మంజూరు చేయిస్తా





### క్రీడా స్థాయి నుండి పోలీస్ అధికారిగా ఎదిగా

### వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వెల్లడి

**తిరునగరి ఆంజనేయస్వామి ప్రజా తీర్పు ప్రతినిధి**

హుజురాబాద్ పట్టణంతో తనకు విడదీయలేనంతగా అనుబంధ ఉన్నదని... ఇక్కడి హై స్కూల్ మైదానాల్లో తాను హాకీ ఆడిన పాత జ్ఞాపకాలు తనను ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటాయని... రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో ఎంతోమంది క్రీడాకారులను అందించిన చరిత్ర హుజురాబాద్ కు ఉందని ఒకనాటి ప్రముఖ క్రీడాకారుడు... మొన్నటి వరకు పోలీస్ అధికారిగా... నేడు వర్ధన్నపేట శాసనసభ్యులుగా పనిచేస్తున్న ఆర్కే నాగరాజు పేర్కొన్నారు. హుజరాబాద్ పట్టణంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్ 14 బాల బాలికలకు సంబంధించిన హాకీ క్రీడోత్సవాలలో భాగంగా శు క్రవారం మొదటి రోజు ముగింపు కార్యక్రమానికి హాజరైన నాగరాజు మాట్లాడుతూ క్రీడాకారులు విద్యుత్ తో పాటు క్రీడలలో కూడా రాణించాలని... ప్రతిరోజు క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయాలని పిలుపునిచ్చారు. ఎంతోమంది క్రీడాకారులకు పుట్టినిల్లుగా పేరుగాంచిన హుజురాబాద్ ఇప్పటికీ కూడా ఆ దిశగానే ముందుకు సాగుతుండడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలోని పేరెన్నిక గల క్రీడాకారుల ప్రతిభా పాట వాల గురించి నేటితరం క్రీడాకారులు క్షుణ్ణంగా తెలుసుకుంటే వ్యక్తిగతంగా ఉపయోగపడుతుందని సూచించారు. ప్రభుత్వం నుండి కూడా క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం సమసిద్ధంగా ఉందని... రానున్న రోజులలో క్రీడలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హుజురాబాద్ ప్రాంత హాకీ క్రీడాకారులు కోరిన విధంగా తాను ముఖ్యమంత్రితో చర్చించి హుజురాబాద్ కు ఆస్ట్రో టర్ఫ్ కోర్టును మంజూరు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ప్రముఖ పీఈటి రవికుమార్ ఆ తర్వాత మీడియాకు తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఏయే క్రీడలు అంటే ఇష్టం ఉన్నదో గ్రహించి అందుకు తగ్గట్లుగా తర్ఫీదు ఇవ్వడానికి చొరవ చూపాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ ప్రాంతం పై తనకున్న మమకారం కారణంగానే ఆలస్యమైనప్పటికీ ప్రత్యేకంగా రాష్ట్రం లోని పది జిల్లాల నుండి తరలివచ్చిన హాకీ కి సంబంధించిన విద్యార్థిని విద్యార్థులను స్వయంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేయాలని తలంపుతో స్వయంగా హుజరాబాద్ కు వచ్చానని ఈ సందర్భంగా నాగరాజు తెలిపారు. ప్రతిరోజు ఉదయం... సాయంత్రం క్రీడలకు ప్రతి విద్యార్థి కొంత సమయం కేటాయించి ప్రాక్టీస్ చేయాలని... ఇలాంటి సందేహాలు ఉన్న ను నిర్మొహమాటంగా పీఈటీలను సంప్రదించాలని ఆయన కోరారు. క్రీడలే కాకుండా ఈరోజు అనేక పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు తనను విపరీతంగా ఆకర్షించాలని... మరింతగా ప్రోత్సహించినట్లయితే ఎంతో మంది కళాకారులు హుజురాబాద్ నుండి రాష్ట్రస్థాయికి ఎదిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ గద్దె రాధిక... ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్... టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడైన బండ శ్రీనివాస్... తాళ్లపల్లి శ్రీనివాస్... మెట్పల్లి రవీందర్రావు... నాగార్జున పాల డైరీ నిర్వాహకులు ప్రభాకర్ రావు... కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షురాలు వేముల పుష్పలత... మాజీ కౌన్సిలర్ భీమగోనీ సురేష్... నిర్వాహకులు వేముల రవికుమార్... పొల్లు సారయ్య... జిల్లా కార్యదర్శి వేణుగోపాల్... పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి ఈ హాకీ క్రీడోత్సవాల సమరానికి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు... ప్రముఖ సామాజికవేత్త... జెన్ ప్యాక్ట్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్... జేఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సింగాపురం జయపాల్ రెడ్డి తదితరులు ఆర్థికంగా తమ చేయూతనందించినట్లు ప్రముఖ పీఈటి వేపుల రవికుమార్ మీడియాకు వివరించారు.

# హైదరాబాద్‌కు రెండో విజయం



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో హైదరాబాద్ మళ్లీ గెలుపుబాట పట్టింది. రాజ్‌కోట్‌లో బీహార్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ 20 ఓవర్లలో 118/9 పరుగులకే పరిమితమైంది హైదరాబాద్ బౌలర్ టేకులపల్లి రవితేజ (4/24) రాణించాడు. అనంతరం లక్ష్యాన్ని హైదరాబాద్ 12.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తి చేసింది. రోహిత్ (56 నాటౌట్), కెప్టెన్ తిలక్ వర్మ (51 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. స్మాట్‌లో ఆడిన 4 మ్యాచ్‌లలో హైదరాబాద్‌కు ఇది రెండో విజయం.



## ఓటమి అంచున లంక లక్ష్యం 526, ప్రస్తుతం 103/5

దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న శ్రీలంక తొలి టెస్టులో ఓటమి అంచున నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగులకే ఆలౌట్ అయిన ఆ జట్టు ఎదుట సఫారీలు రెండో ఇన్నింగ్స్‌లో 516 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపారు. అయితే మూడో రోజు ఆట ముగిసే సమయానికి లంకేయులు.. 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేశారు. ఆ జట్టు ఇంకా 413 పరుగులు వెనుకబడి ఉంది. ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్ చేరిన నేపథ్యంలో ఆ జట్టుకు భారీ ఓటమి తప్పేలా లేదు. దినేశ్ చండిమాల్ (29 నాటౌట్), ధనంజయ డి సిల్వ క్రీజులో ఉన్నారు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా.. 366/5 వద్ద సెకండ్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (122), సారథి టెంబ బవుమా (113) శతకాలతో మెరిశారు.




## హెూరాహెూరీగా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, చైనా ఆటగాడు డింగ్ లిరెన్ మధ్య సింగపూర్ వేదికగా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ హెూరాహెూరీగా సాగుతోంది. శుక్రవారం ఈ ఇరువురి మధ్య జరిగిన నాలుగో గేమ్ డ్రాగా ముగిసింది. దీంతో 14 గేమ్‌లు ఉన్న ఈ టోర్నీలో 4 గేమ్‌లు ముగిసేసరికి ఇరువురి ఖాతాలో తలా 2 పాయింట్లు చేరాయి. తొలి మ్యాచ్‌లో మాదిరిగానే ఆరంభం నుంచే దూకుడుగా ఆడేందుకు లిరెన్ యత్నించాడు. ప్రారంభంలో అతడి పావుల కదలిక అలాగే సాగింది. కానీ గుకేశ్ ఎక్కడా ఒత్తిడికి గురికాకుండా బదులివ్వడంతో అతడు వెనక్కి తగ్గాడు. ఆట మధ్యలోకి వచ్చేసరికి ఇరువురూ పలు తప్పిదాలు చేశారు. ఈ క్రమంలో జాగ్రత్త పడ్డ గుకేశ్, లిరెన్.. గేమ్ కోల్పోకుండా సేఫ్‌గా ఆడారు. 42 ఎత్తుల తర్వాత ఆట డ్రా గా ముగిసింది.

## సెమీస్‌కు సింధు అదరగొట్టిన లక్ష్యసేన్, ఉన్నతి

గత రెండేండ్లుగా బీడబ్ల్యూఎఫ్ టైటిల్ వేటలో ఉన్న పీవీ సింధు ఆ కొరతను తీర్చుకునే దిశగా కీలక ముందడుగు వేసింది. లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె సెమీఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో కష్టమ్మీద నెగ్గిన 18వ ర్యాంకర్ సింధు.. శుక్రవారం ఇక్కడ జరిగిన క్వార్టర్స్‌లో 21-15, 21-17తో దై వాంగ్ (చైనా)పై గెలిచింది. 48 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో సింధు.. అంతగా అనుభవం లేని చైనా అమ్మాయిపై అలవోక విజయం సాధించింది. సెమీస్‌లో ఆమె భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్స్‌లో ఉన్నతి 21-16, 21-9తో ఇషికా జైస్వాల్ (యూఎస్‌ఏ)ను ఓడించి సింధుతో పోరుకు సిద్ధమైంది. ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-8, 21-19తో మీరబ లువాంగ్(భారత్)ను ఓడించి సెమీస్‌లోకి ప్రవేశించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ, మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ ద్వయం సైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.




## సత్తాచాటిన టీటీ ప్లేయర్లు



ఇండోర్(మధ్యప్రదేశ్) వేదికగా జరిగిన యూటీటీ జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తాచాటారు. పురుషుల ఫైనల్లో హితేశ్ దోల్వాని 11-6, 11-5, 11-4తో విశ్వ తంబె(మహారాష్ట్ర)పై గెలిచి టైటిల్ విజేతగా నిలిచాడు. మహిళల క్లాస్-4 తుది పోరులో విజయ దీపిక 10-12, 7-11, 9-11తో భవీనా పటేల్(గుజరాత్) చేతిలో రన్నరప్‌గా నిలిచింది. మహిళల క్లాస్ 8లో నిశాకుమారి 4-11, 5-11, 9-11తో సవితా అంజనకట్టి(కర్నాటక) చేతిలో ఓడి రజతం దక్కించుకుంది.

## నేడు ప్రైమినిస్టర్ లెవెన్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా తొలి టెస్టులో కంగారూలపై భారీ తేడాతో గెలిచి జోరుమీదున్న భారత క్రికెట్ జట్టు శనివారం నుంచి ప్రైమినిస్టర్ లెవన్‌తో రెండ్రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌కు సిద్ధమైంది. వచ్చేనెల 6 నుంచి అడిలైడ్ వేదికగా జరుగబోయే డే అండ్ నైట్ పింక్ టెస్టుకు ముందు టీమ్ఇండియాకు ఇది మంచి సన్నాహకంగా ఉపయోగపడనుంది. పెర్త్ టెస్టులో ఆడని రోహిత్‌శర్మ ఈ మ్యాచ్‌లో ఆడనుండగా వేలి గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్ అడిలైడ్ టెస్టు ఆడతాడా? లేదా? అన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశముంది. శుక్రవారం అతడు నెట్స్‌లో సాధన చేశాడు. రోహిత్ రాకతో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుతారా? లేక సారథే వన్ డౌన్‌లో వస్తాడా? అన్నది సరిచూసుకోవడానికి ప్రాక్టీస్ మ్యాచ్ భారత్‌కు మంచి అవకాశం.



## ప్రేక్షకుల అంచనాలను తలకిందులు చేస్తూ కొత్తసినిమాను స్టార్ట్ చేసిన సూర్య..!



సక్సెస్ ఫెయిల్యూర్‌తో సంబంధం లేకుండా తన పని తాను చేసుకుపోతున్నారు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య. భారీ ఆశలు పెట్టుకున్న కంగువా నిరాశపరచటంతో సూర్య బ్రేక్ తీసుకుంటారని ఎక్స్‌పెక్ట్ చేశారు ఇండస్ట్రీ జనాలు. కానీ సూర్య మాత్రం ఏ మాత్రం గ్యాప్ తీసుకోకుండా కొత్త సినిమాను పట్టాలెక్కించారు. సూర్య హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ మూవీ కంగువా. శివ దర్శకత్వంలో రూపొందించిన ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా భారీగా రిలీజ్ చేశారు. ఈ సినిమా మీద భారీ ఆశలు పెట్టుకున్న నడిప్పిన్ నాయగన్, దేశమంత తిరిగి సినిమాను ప్రమోట్ చేశారు.కానీ ఆఫ్టర్ రిలీజ్ అంచనాలు తలకిందులు అయ్యాయి. భారీ బడ్జెట్‌తో ప్రస్టీజియస్‌గా తెరకెక్కించిన కంగువా, బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచింది.

## కమర్షియల్ సినిమాలకు దూరంగా చెన్నై చంద్రం.?



సౌత్‌లో సూపర్ హిట్ అయిన హీరోయిన్లు నార్త్‌లో పాగా వేయాలనుకుంటారు. ఇన్నాళ్లు ఈ విషయంలో నో చెప్పిన నయనతార కూడా రీసెంట్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చేశారు. అయితే చాలా ఏళ్ల కిందటే నార్త్ మూవీ చేసిన ఓ సీనియర్ బ్యూటీ మాత్రం బాలీవుడ్ జర్నీకి లాంగ్ బ్రేక్ ఇచ్చారు. ఏకంగా 14 ఏళ్ల తరువాత మళ్లీ ఓ హిందీ మూవీకి ఓకే చెప్పారు. ప్రజెంట్ సౌత్ ఇండస్ట్రీలో గోల్డెన్ ఫేజ్‌లో ఉన్నారు చెన్నై చంద్రం త్రిష కృష్ణన్. సౌత్‌లో సూపర్ హిట్ అయిన హీరోయిన్లు నార్త్‌లో పాగా వేయాలనుకుంటారు. ఇన్నాళ్లు ఈ విషయంలో నో చెప్పిన నయనతార కూడా రీసెంట్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చేశారు. అయితే చాలా ఏళ్ల కిందటే నార్త్ మూవీ చేసిన ఓ సీనియర్ బ్యూటీ మాత్రం బాలీవుడ్ జర్నీకి లాంగ్ బ్రేక్ ఇచ్చారు. ఏకంగా 14 ఏళ్ల తరువాత మళ్లీ ఓ హిందీ మూవీకి ఓకే చెప్పారు. ప్రజెంట్ సౌత్ ఇండస్ట్రీలో గోల్డెన్ ఫేజ్‌లో ఉన్నారు చెన్నై చంద్రం త్రిష కృష్ణన్. లేడీ ఓరియంటెడ్ సినిమాలతో పాటు కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తూ కెరీర్‌లో మంచి ఫామ్ చూపిస్తున్నారు.

## ‘పుష్ప 2 సినిమాతో నేషనల్ అవార్డు పట్టేస్తా’..

‘పుష్ప1 ది రైజ్ సినిమాలో నటనకు గానూ జాతీయ ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డ్ అందుకున్నాడు అల్లు అర్జున్. అయితే ఇప్పుడు ‘పుష్ప 2’ సినిమాతో తనకు కూడా కచ్చితంగా జాతీయ ఉత్తమ నటి అవార్డు వస్తుందంటోంది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. రష్మిక మందన్న ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. కన్నడ సినిమాతో మొదలైన ఆమె ప్రయాణం ఆ తర్వాత తెలుగు, హిందీ, తమిళం, కన్నడ భాషల్లోనూ సాగింది. ముఖ్యంగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఈ ముద్దుగుమ్మకు మంచి డిమాండ్ ఉంది. తన అభినయ ప్రతిభకు ప్రతీకగా ఇప్పటికే ప్రశంసలు, పురస్కారాలు కూడా సొంతం చేసుకుంది. అయితే పుష్ప 2 సినిమాతో జాతీయ అవార్డు కూడా తన ఖాతాలోకి వస్తోందని ధీమాగా చెబుతోంది రష్మిక మందన్నా. ‘పుష్ప’లో తన నటనకు ‘ఉత్తమ నటుడిగా’ జాతీయ అవార్డును అందుకున్నాడు అల్లు అర్జున్.



Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020